ఉద్యోగ మేళాకు స్పందన

కొత్తగూడెం సంక్షేమ విభాగం, న్యూస్‌టుడే: నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు గురువారం నిర్వహించిన ఉద్యోగ మేళా విజయవంతమైందని జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. కొత్తగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో రెండు ప్రైవేటు కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించిన మేళాకు 256 మంది నిరుద్యోగులు హాజరయ్యారని చెప్పారు. ముఖాముఖీల్లో 108 మంది ప్రతిభ చూపగా, వారికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు వివరించారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి: కలెక్టర్

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లోని అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాల్సిన బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. పాతకొత్తగూడెం ఆనంద ఖని విద్యా వనరుల శిక్షణ కేంద్రంలో మండల విద్యాశాఖాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. వచ్చే పదోతరగతి వార్షిక పరీక్షల సన్నద్ధతకు చివరి రెండు నెలలు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ఔషధ, అలంకరణ మొక్కలు నాటించాలన్నారు. డీఈఓ ముమ్మడి వెంకటేశ్వరాచారి, ప్రభుత్వ పరీక్షల సహాయాధికారి సాదనపల్లి మాధవరావు, ఏఎంఓ నాగరాజశేఖర్, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

'మేం పనిమీద అధికారి వద్దకు వెళ్తే దగ్గరకు రా అంటాడు. చెప్పేదేదో పక్కన నిల్చొని చెప్పు అంటాడు. మహిళలని చూడకుండా చులకన చేసి మాట్లాడతాడు. మాటమాటలో అధికార మదాంధకారమే. చేసేదేమీ లేక యూనియన్ నాయకులను ఆశ్రయించాం'.
- ఓ బాధితురాలు

'ఉదయం, సాయంత్రం వేళలతో అతడికి పనిలేదు. ఉద్యోగం కన్నా కామవాంఛలు తీర్చుకోవటాన్నే పనిగా పెట్టుకుంటాడు. ఆయన భార్య స్థానికంగా ఉండకపోవటంతో ఉదయాన్నే తన కార్యాలయానికి ఎవరో ఒక ఉద్యోగిని పిలుస్తాడు. మధ్యాహ్నం ఇంట్లో పని ఉంది రావాలని చెబుతాడు. కొందరు భయంతో ఆయన చెప్పినట్టు వింటారు. మరికొందరు దూరంగా పారిపోతారు'. - మరో ఉద్యోగిని ఆవేదన

శిక్షణ కేంద్రంలో దుష్టుడు



పాల్వంచ, న్యూస్‌టుడే

ఆయనో ఇంజినీరింగ్ అధికారి. తాను పనిచేసే కేంద్రంలో ఉద్యోగినులను వక్రబుద్ధితో చూస్తాడు. శారీరకంగా లోబర్చుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తాడు. మాట వింటే సరి.. లేదంటే వేధింపులను తీవ్రతరం చేస్తాడు. అవసరమైతే తన అధికారంతో వేరేచోటుకు బదిలీ చేసేందుకూ వెనుకాడడు. ఇటీవల కార్యాలయ పని నిమిత్తం ఓ ఉద్యోగిని ఆయన ఛాంబర్‌కు వెళ్లారు. ఆమె టేబుల్ వద్దకు రాగానే ఉన్నట్టుండి అధికారి చేతిలోని పెన్ను కిందపడిపోయింది. దాన్ని తీసివ్వాలన్నది ఆయన హుకుం. పెన్ను తీసిచ్చేంతలోపే ఆయన కళ్లు ఆమె శరీరాన్ని స్కాన్ చేశాయి. అనంతరం ఆయన అసభ్య పదజాలం ప్రయోగించాడు.

వేధింపులు తాళలేక..

పాల్వంచలోని టీజీ జెన్కో శిక్షణ కేంద్రం (సీఈటీడీ)లో కొత్త ఉద్యోగులకు నైపుణ్య శిక్షణలిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 13 విద్యుత్కేంద్రాల్లో పనిచేస్తున్న 10వేల మంది ఉద్యోగులకు వృత్తిపరమైన శిక్షణలు ఇక్కడే నిర్వహిస్తుంటారు. సుమారు 50 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా వీరిలో 21 మంది మహిళలే. ఇక్కడ కొన్నేళ్లుగా కీలక అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఓ ఇంజినీర్ వ్యవహార శైలిపై దుమారం చెలరేగుతోంది. ఉద్యోగినులను లైంగికంగా వేధిస్తున్నారు. తన దారికి వస్తే సరి, లేదంటే బదిలీ చేసి కక్షసాధిస్తున్నారు. చాలామంది బాధితులు పరువు పోతుందనో? కుటుంబ సభ్యుల కోసమనో ఇన్నాళ్లు పెదవి విప్పలేదు. ఇటీవల ఇద్దరు ఉద్యోగినులు ఓ సంఘం నాయకుల వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. ఆవేదనతో కంటతడి పెట్టారు. స్పందించిన నాయకులు కేంద్రం చీఫ్ ఇంజినీర్(సీఈ)తో మాట్లాడారు. అధికారిపై ఫిర్యాదిచ్చారు. ఇదే సమయంలో బాధిత ఉద్యోగినులు తమకు ఎదురైన వేధింపులు, జరుగుతున్న అన్యాయంపై నోరు విప్పారు. సదరు కీచక అధికారి కంట్లో పడటం ఇష్టం లేనివారు కొందరు బదిలీ చేయించుకున్నట్లు సమాచారం.

శిక్షణ కేంద్రంలోని ఓ అధికారి వేధింపులపై ఫిర్యాదు అందిన మాట వాస్తవమే. ఆయన ఉద్దేశపూర్వకంగా కొందరిని బదిలీ చేయించినట్లు ఆరోపణలొచ్చాయి. ఈవిషయంపై సదరు అధికారితో మాట్లాడా. యూనియన్ నాయకుల ఫిర్యాదు అంశాన్ని టీజీ జెన్కో రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.
- శ్రీనివాస్‌బాబు, సీఈ, టీజీ జెన్కో శిక్షణ కేంద్రం



ఆర్థిక భద్రతే కాదు.. ఆరోగ్యమూ ముఖ్యమే

☆ వయోధికులకు డాక్టర్ వేమ గంగరాజు సూచనలు

ఈటీవీ, ఖమ్మం, న్యూస్‌టుడే, ఖమ్మం వైద్యవిభాగం

'ఉద్యోగ విరమణ పొందాం. ఇంకేముంది? కృష్ణా రామా అనుకుంటూ హాయిగా విశ్రాంతి తీసుకుందాం. ఈ వయసులో శారీరక శ్రమ అవసరమా?' ఆరుపదులు దాటిన వారంతా ఇలాగే ఆలోచిస్తుంటారు. ఉద్యోగ విరమణ పొందినవారు, వయసు పైబడి.. పనులకు విరామమిచ్చిన వారు ఆర్థిక భద్రత గురించి బాగానే ఆలోచిస్తుంటారు. ఆరోగ్య భద్రతను అంతగా పట్టించుకోరు. నిజానికి ఆర్థిక భద్రత కన్నా వెయ్యి రెట్లు ఆరోగ్య భద్రతే ప్రాధాన్యమివ్వాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. మలివయసులో పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలు, వ్యాయామాలతో కలిగే ప్రయోజనాలపై ఖమ్మంలో జనరల్ మెడిసిన్ ప్రముఖ వైద్యుడు డాక్టర్ వేమ గంగరాజు సూచనలు, సలహాలు మీకోసం..



వయసు పైబడుతున్న కొద్దీ జీర్ణవ్యవస్థ మందగిస్తుంది. అజీర్ణం, పొట్ట ఉబ్బరం, పుల్లటి త్రేన్పుల వంటి సమస్యలు పెరుగుతాయి. అందువల్ల వయసుకు తగ్గట్టుగా ఆహారంలో మార్పులు చేసుకోవాలి. సమతుల ఆహారం తినాలి. చక్కెర, తీపిపదార్థాలు, ఉప్పు తగ్గించాలి. తినే ఆహారంలో సగం వరకు ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు ఉండాలి.

మితాహారమే మిన్న

మాంసకృత్తులూ ముఖ్యమే. పిండిపదార్థాలు, నూనె, వేపుళ్లు తగ్గించుకోవాలి. ధూమపానం, మద్యపానం మానుకోవాలి. క్రమం తప్పకుండా రక్తపోటు, గ్లూకోజు, కొలెస్ట్రాల్ వంటి సాధారణ వైద్యపరీక్షలు చేయించుకోవాలి. మధుమేహం గలవారు మందులు, ఆహార, వ్యాయామ నియమాలతో గ్లూకోజును కచ్చితంగా అదుపులో ఉంచుకోవాలి. మందులు వేసుకొని, ఆహారం తీసుకోకుండా నడిస్తే ఒక్కోసారి గ్లూకోజు మోతాదులు పడిపోవచ్చు. బొప్పాయి, జామ వంటి పండ్లు తీసుకోవాలి. శ్వాసకోశ బాధితులు ఆరుబయట కాకుండా ఇంట్లోనే నడవటం మేలు. ఉదయం 8 గంటల తర్వాత నడక మొదలెట్టాలి. మరీ చల్లగా ఉన్నపుడు నడవొద్దు.

వ్యాయామమే శ్రీరామరక్ష

విశ్రాంత సమయంలో ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి. వ్యాయామం, యోగా, ధ్యానం వంటి వాటిపై దృష్టి సారించాలి. వ్యాయామాల్లో నడక తేలికైంది. నడకతో శరీరం దృఢంగా ఉండటమే కాకుండా మానసిక ఆరోగ్యమూ మెరుగుపడుతుంది. వ్యాయామాలు చేస్తున్నప్పుడు ఉల్లాసం, హాయి భావనను కలిగించే ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. అందువల్ల రోజుకు కనీసం 30 నిమిషాలు నడిస్తే మంచిది. వ్యాయామానికి ముందు శరీరాన్ని సన్నద్ధం చేయటం (వార్మప్) ముఖ్యం. తద్వారా బిగుసుకున్న కండరాలు, కీళ్లు సడలుతాయి. గాయాల బారినపడే అవకాశం తగ్గుతుంది. వ్యాయామం చేసేటప్పుడు నూలు దుస్తులు ధరిస్తే మంచిది. రాళ్లు లేని ప్రాంతం, నడక ప్రదేశం కింద ట్రాక్‌లో నడవటం మంచిది. నేల చదునుగా ఉన్నచోట నడిస్తే మోకాళ్ల నొప్పులు తలెత్తకుండా చూసుకోవచ్చు. వ్యాయామానికి ముందు తర్వాత నీళ్లు తాగడం మర్చిపోవద్దు. హృద్రోగులు వ్యాయామాలను ఆరంభించటానికి ముందు గుండె సామర్థ్యాన్ని పరీక్షించుకోవాలి. సాధారణంగా ఆరోగ్యవంతుల్లో గుండె.. రక్తాన్ని పంపింగ్ సామర్థ్యం (ఏఎఫ్) 60% ఉండాలి. గుండెజబ్బులతో బాధపడే కొందరిలో ఇది 30 శాతం ఉండొచ్చు. అంటే గుండె అంత సమర్థంగా పంప్ చేయటం లేదనే అర్థం. వీరికి నడక అంత మంచిది కాదు.






60 ఏళ్లపైబడిన వారు
ఖమ్మం: 1.66 లక్షలు
భద్రాద్రి : 1.54 లక్షలు

మానసిక ఉల్లాసమూ ప్రధానమే

జీవిత చరమాంకంలో మానసికోల్లాసం మెరుగుపరుచుకోవటం ముఖ్యం. వయసు పెరుగుతున్నకొద్దీ ఒంటరితనం ఆవహిస్తుంది. ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. రకరకాల ఒత్తిళ్లతో ఇబ్బందులు ఎదురవుతాయి. కాబట్టి మానసికంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండటానికి ప్రయత్నించాలి. ఒత్తిడిని అధిగమించేందుకు యోగా, ధ్యానం ఉపయోగపడతాయి. అవసరమైతే వైద్యుల సలహా మేరకు మందులు వేసుకోవాలి. కుటుంబ సభ్యులు, స్నేహితులు, మిత్రులతో సమయాన్ని గడపాలి. సామాజిక సంబంధాలు మెరుగుపరుచుకోవాలి. ఫ్రెండ్స్ క్లబ్బులు ఏర్పాటు చేసుకోవాలి. మనసుకు ఇష్టమైన సంగీతం, పుస్తకాలు చదవటం, ఇతరులతో చర్చించటం, సినిమాలు చూడటం, చిన్నపిల్లలతో ఆడుకోవటం వంటి అలవాట్లను కొనసాగించాలి. కొత్త విషయాలను నేర్చుకోవడం ద్వారా మెదడుకు ప్రేరణ కలుగుతుంది. క్రమపద్ధతిలో రోజువారీ పనులు చేసుకోవటం మంచిది. ఎదుటివారితో అనుభవాలు, భావోద్వేగాలను పంచుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుంది.



ఒకరిని చూసి ఒకరు..

ఊబిలో కూరుకుపోయారు

☆ ఆన్‌లైన్ పెట్టుబడి పేరుతో.. రూ.25 లక్షలు మోసపోయిన వైనం

తక్కువ మొత్తంతో అధిక లాభాలంటూ ఊరించారు. అందుకే అప్పులు చేసి మరీ యాప్‌లో పెట్టుబడులు పెట్టారు. ఆ తర్వాత కానీ తెలియలేదు.. 'డబ్బులు ఊరికే రావని?!'. ఒకరా.. ఇద్దరా.. ఏకంగా 150 మంది సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న ఉదంతమిది. వివిధ ఉదంతాల్లో ఘోరంగా మోసపోయినవారు లబోదిబోమంటున్నా, ఆన్‌లైన్ పెట్టుబడితో మోసపోవద్దని పోలీసులు పదే పదే చెబుతున్నా.. డబ్బుపై అత్యాశతో తరచూ ఎవరో ఒకరు బోల్తాపడుతూనే ఉన్నారు. ఒకరిని చూసి మరొకరు ఊబిలోకి దిగుతున్నారు. ఫోన్ యాప్‌లో పెట్టుబడి అంటూ ఏకంగా రూ.20 లక్షల వరకు నష్టపోయిన వైనం సుజాతనగర్ మండలంలో తాజాగా చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. రాఘవాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి యాప్‌లో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలొస్తున్నాయని ఆశపడ్డారు. తన స్నేహితులను చూసి తానూ రూ.15వేలను సైబర్ నేరగాళ్లు సూచించిన యాప్‌లో జమ చేశాడు. ఆ తర్వాత కొన్నాళ్ల పాటు రోజుకు రూ.630 చొప్పున జమ చేసి నమ్మించారు. అతణ్ని చూసి ఇంకొకరు.. వారిని చూసి మరికొందరు.. ఇలా మండల వ్యాప్తంగా సుమారు 150 మంది స్థోమతను బట్టి రూ.100 నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. వారిలో చాలామందికి వారం పాటు నిర్ణీత మొత్తాన్ని బట్టి రోజుకు రూ.60 నుంచి రూ.6 వేల వరకు ఖాతాలో డబ్బులు జమయ్యాయి. యాప్‌పై భారీ ప్రచారం జరగడంతో ఇటీవల కాలంలో ఏకంగా రూ.25 లక్షల వరకు సొమ్ము జమచేశారు. కానీ, రెండ్రోజులుగా ఖాతాల్లో సొమ్ము పడకపోవడంతో ఒకరి మొహాన్ని ఒకరు చూసుకుని తెల్లబోతున్నారు. ఈ సమాచారం దావానలంలా వ్యాపించటంతో.. తాము మోసపోయామని వివిధ గ్రామాల బాధితులు ఆందోళన చెందుతున్నారు. కొత్తగూడెంలోని సైబర్ క్రైం విభాగం పోలీసులను ఆశ్రయించనున్నట్లు పలువురు బాధితులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని సుజాతనగర్ పోలీసులు స్పష్టం చేశారు.

- సుజాతనగర్, న్యూస్‌టుడే

గవర్నర్‌కు ఘనస్వాగతం

కొత్తగూడెం కలెక్టరేట్, బూర్గంపాడు, న్యూస్‌టుడే: జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, అధికారులు గురువారం ఘనస్వాగతం పలికారు. సారపాకలోని ఐటీసీ అతిథి గృహంలో ఆయనకు మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం పోలీసుల నుంచి గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు. అంతకుముందు రోడ్డు మార్గంలో కొత్తగూడెం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఇక్కడి నుంచి సారపాకకు బయల్దేరి వెళ్లారు. రాత్రికి సారపాకలోనే బస చేయనున్నారు. ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ రాహుల్, రామాలయం ఈఓ రమాదేవి పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌కు రాక: కలెక్టరేట్‌లో అన్ని శాఖల జిల్లా అధికారులతో శుక్రవారం నిర్వహించే సమావేశంలో గవర్నర్ పాల్గొంటారు. కవులు, కళాకారులు, వివిధ రంగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు అందుకున్న వారితో ఉదయం 10 గంటలకు సమావేశమవుతారు. వారితో కాసేపు మాట్లాడిన తర్వాత 11 గంటలకు ఖమ్మం బయలుదేరి వెళ్తారు.



పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

నేడు థలసీమియా వార్డు ప్రారంభం

భద్రాచలం, న్యూస్‌టుడే: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం ఉదయం 8 గంటలకు భద్రాచలంలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవనం వద్దకు చేరుకుంటారు. అక్కడ 20 మంచాల థలసీమియా, సికిల్‌సెల్ ఎనీమియా వార్డును ప్రారంభిస్తారని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ ఎస్ఎల్ కాంతారావు తెలిపారు. ఉదయం 8.10 గంటలకు శ్రీ సీతారామచంద్రస్వామిని గవర్నర్ దర్శించుకుంటారు. 'ప్రసాద్' పనులతో పాటు రామాలయ అభివృద్ధిపైనా ఆయన ఆరా తీసే అవకాశముంది.

పెద్దమ్మతల్లి హుండీ ఆదాయం లెక్కింపు

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: పెద్దమ్మతల్లి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించినట్లు ఆలయ ఈవో రజనీకుమారి తెలిపారు. 3 నెలల 12 రోజులకు గాను రూ.39,34,078 రూపాయల హుండీ ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో అర్చనను అర్చకులు గురువారం నిర్వహించారు. శాశ్వత అన్నదానం కార్యక్రమానికి ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన అమ్మవారి భక్తులు ఎన్.మధు-యామిని దంపతులు రూ.1,11,116 విరాళం ఇచ్చారు.



విరాళాన్ని అందించిన ఎన్.మధు దంపతులను సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

కార్తిక మాసోత్సవాలకు ఏర్పాట్లు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో కార్తిక మాసోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు ఈఓ రమాదేవి గురువారం తెలిపారు. ముఖ్య ఉత్సవాల వివరాలను ప్రకటించారు. నవంబరు 1 నుంచి 5 వరకు మణవాళ మహాముణుల తిరు నక్షత్ర ఉత్సవాలు ఉంటాయన్నారు. 9న పూదత్తాళ్వార్, 10న పేయాళ్వార్ తిరునక్షత్ర ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. 12న సర్వ ఏకాదశి సందర్భంగా పవళింపు సేవ ఉండదని చెప్పారు. 13న క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా జగన్మోహిని అలంకారంలో దర్శనమిస్తారన్నారు. 15న ధాత్రీ నారాయణ క్షీరాభిషేకం నిర్వహిస్తారని తెలిపారు. 20న శ్రీరామ పునర్వసు దీక్షలను ప్రారంభిస్తారని చెప్పారు. 21న పుష్యమిని పురస్కరించుకుని పట్టాభిషేకం జరుపుతామన్నారు. 27న గోదావరికి హారతి అందిస్తామని వెల్లడించారు. ప్రత్యేక రోజుల్లో సత్యనారాయణ స్వామి వ్రతాలు ఉంటాయని పేర్కొన్నారు.



పొలంలో ఇసుక మేటలను యంత్రంతో తొలగిస్తున్న రైతు

ముంచెత్తిన వరదలతో.. అన్నదాతలకు ఆర్థికభారం

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఇది ఏదో భారీ బహిరంగ సభ ఏర్పాటుకు తయారు చేస్తున్న సభా ప్రాంగణమో.. ఏ వాగు నుంచో ఇసుక తెచ్చి డంపు చేసిన చిత్రాలు అనుకునేరు. జులై 18న భారీ వర్షాల కారణంగా ప్రకృతి ప్రకోపానికి ఇసుక మేటలు వేసిన పంట పొలాలు. నారాయణపురం సమీపంలోని పంట పొలాల్లో ఇసుక మేటలను ఓ యంత్రంతో తొలగించి పొలంలోనే ఓ పక్కన కుప్పగా పోయగా గురువారం 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది. ఒక ఎకరంలో ఇసుక మేటలు తొలగించడానికి రూ.60వేల వరకు ఖర్చవుతున్నట్లు అన్నదాతలు వాపోతున్నారు.





గిరిజన మ్యూజియానికి

దారేది..?

భద్రాచలం, న్యూస్‌టుడే

భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియాన్ని విస్తరించి మరింత ప్రాచుర్యం కల్పించాలని ఉన్నతాధికారులు నిర్ణయించినప్పటికీ లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఐటీడీఏ మార్గంలో గేట్ వద్ద అందరికీ తెలిసేలా పెద్ద బోర్డు ఏర్పాటు చేశారు. గతంలో ఇటుగుండా రాకపోకలు సాగేవి. ఆకతాయిలు రాత్రిపూట ఇలాంటి ద్వారాల గుండా లోపలికి ప్రవేశిస్తున్నారనే కారణంతో గేటును మూసేశారు. దీన్ని తెరిస్తే సులువుగా మ్యూజియానికి వెళ్లవచ్చు. దీనికి సమీపంలోని విద్యా వనరుల విభాగం వద్ద ఉన్న ద్వారాన్నీ ఇలాగే మూసేశారు. పర్యాటకులైనా, ఇక్కడికి అవసరాల కోసం వచ్చే గిరిజనులైనా ఐటీడీఏ కార్యాలయం ప్రధాన ద్వారం గుండానే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. దీన్ని గుర్తించి మ్యూజియం వద్ద ఉన్న గేట్లను వినియోగంలోకి తీసుకొస్తే యాత్రికులకు సులభంగా ఉంటుంది. ఇదే క్రమంలో చాన్నాళ్ల క్రితం నిర్మించిన ప్రహరీ పక్కన రహదారి ఎత్తుగా ఉండటంతో సులభంగా గోడ దూకి ఐటీడీఏ ప్రాంగణంలోకి వెళ్లవచ్చు. గేట్లు తెరచి గోడ ఎత్తు పెంచి సెక్యూరిటీ గార్డులను నియమించాలని పలువురు కోరుతున్నారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ త్వరలోనే గేట్లను తెరిచి మ్యూజియానికి సులువుగా చేరుకునేలా చేస్తామని తెలిపారు.

పేరుకే.. ఊరికే..!



ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పత్తి కొనుగోళ్లు ఊపందుకోలేదు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చాలావరకు పంట దెబ్బతింది. పత్తితీతలకు వర్షం ప్రధాన అవరోధంగా మారింది. ఎకరాకు 10-12 క్వింటాళ్ల వరకు రావాల్సిన దిగుబడి ఇప్పుడు 3-4 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి కనిపించటం లేదు. వర్షాలకు ముందు తీసిన పత్తిని తమ అవసరాల నిమిత్తం రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. వర్షం ప్రభావం లేని ప్రాంతాల్లో రైతులు పత్తితీతలు మొదలుపెట్టారు. – ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

ధర లేక రైతులకు దిగాలు..

ఖమ్మం, ఏన్కూరు, వైరా వ్యవసాయ మార్కెట్ పరిధిలోని తల్లాడలో, సుజాతనగర్, జూలూరుపాడులో ప్రైవేటు వ్యాపారులు పత్తిని కొంటున్నారు. ప్రభుత్వం ఈసంవత్సరం పత్తికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7,521 ప్రకటించింది. కానీ రైతులు తెచ్చే పత్తిలో నాణ్యత లేదనే సాకుతో వ్యాపారులు దోచుకుంటున్నారు. క్వింటాకు కేవలం రూ.5వేల నుంచి రూ.6,100 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని ఆరబెట్టుకుని ఆతర్వాత 'సీసీఐ' కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర పొందటం ద్వారా మంచి లాభాలు ఆర్జిస్తారు. ఆరుగాలం కష్టపడిన రైతులకు అప్పులే మిగులుతున్నాయి.



ఖమ్మం మార్కెట్లో లారీలో లోడు చేసిన పత్తి బస్తాలు

సీసీఐ కొనుగోలు కేంద్రాలు వెలవెల..

ఖమ్మం జిల్లాలో తొమ్మిది, భద్రాద్రి జిల్లాలో నాలుగు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఖమ్మం గ్రామీణ మండలం గుర్రాలపాడులోని కొనుగోలు కేంద్రంలో తొమ్మిది మంది రైతులకు చెందిన 269 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొన్నారు. మిగతాచోట్ల ఎక్కడా ఒక్క కిలో పత్తినీ కొనకపోవటం గమనార్హం. ప్రస్తుతం రైతుల చేతికొచ్చిన పత్తిలో 20-30 తేమ శాతం ఉంటుంది. తేమ శాతం 8-12 ఉంటేనే సీసీఐ కొనుగోలు చేస్తుంది. తేమ శాతం ఎక్కువగా ఉండటంతో రైతులు తక్కువ ధరకే ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 'సీసీఐ' కేంద్రాలకు వచ్చి కొనుగోళ్ల గురించి కర్షకులు ఆరా తీస్తున్నారు. వ్యవసాయశాఖ జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో తెలుసుకుంటున్నారు. తేమశాతంలో తేడా ఎక్కువగా ఉండటంతో ఇప్పట్లో 'సీసీఐ' కేంద్రాల్లో సరకును కొనుగోలు చేసే అవకాశం కనిపించటం లేదు. నవంబరు మొదటి వారం నుంచి కొనుగోళ్లు ఊపందుకుంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు 'సీసీఐ' కేంద్రాల్లో కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

'సీసీఐ' కేంద్రాలు పత్తి కొనుగోళ్లకు సిద్ధంగా ఉన్నాయి. నిబంధనల ప్రకారం 8-12 తేమ శాతం ఉంటేనే నిర్వాహకులు కొంటారు. ఇప్పుడు వచ్చే పత్తిలో తేమ శాతం చాలా ఎక్కువగా ఉంటోంది. అందుకే చాలామంది రైతులు వ్యవసాయ మార్కెట్లలో వ్యాపారులకు విక్రయిస్తున్నారు.
- ఎంఏ అలీం, డీఎంఓ, ఖమ్మం

ఆడుదాం దాండియా!

ఆసక్తి చూపుతున్న అతివలు

ఖమ్మం బల్లేపల్లి, న్యూస్‌టుడే


దాండియా శిక్షణ తీసుకున్న వనితలు

దసరా, దీపావళి పండుగ సంబరాల్లో దాండియా నృత్యం ఒకభాగం. ఒకప్పుడు ఉత్తరాది రాష్ట్రాలకే పరిమితమైన దాండియా నృత్యం ఇప్పుడు అన్ని ప్రాంతాల్లో విస్తరించింది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో స్థిరపడిన ఉత్తరాది మగువలతో పాటు మన ఆడబిడ్డలు సైతం కొత్తగా దాండియా నృత్యంపై ఆసక్తి చూపుతున్నారు. దశాబ్ద కాలంగా కోలాట నృత్యాలతో సందడి చేస్తున్న నారీమణులు ఇప్పుడు ఉత్సాహంగా ఇంకో అడుగు ముందుకేశారు. రెండేళ్ల నుంచి ఈవెంట్ ఆర్గనైజర్స్ హైదరాబాద్ తరహాలో ఖమ్మం నగరంలోనూ 'దాండియా నైట్' పర్వదినాల సందర్భంలో ఈవెంట్‌ను నిర్వహిస్తున్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలల్లో సైతం స్వాగత వేడుకల్లో యువత దాండియాతో దుమ్మురేపుతున్నారు. ఈ క్రమంలో దాండియా శిక్షణ తీసుకున్న మహిళలను 'న్యూస్‌టుడే' పలకరించింది.

దాండియాకు ప్రత్యేకంగా అలంకరణ



దాండియా నృత్యానికి నప్పేలా ఉండాలని అలంకరణ కోసం శ్రద్ధ తీసుకున్నా. అందుకోసం ప్రత్యేకంగా వస్త్రాలను కొనుగోలు చేశా. దాండియాకు తగ్గట్టుగా నా దగ్గర ఉన్న నగల సెట్స్‌లో ఒకటి ఎంపిక చేసుకున్నా. సుమారుగా రూ.3 వేల వరకూ ఖర్చు చేశా. ఈ సంవత్సరం ఇలా అలంకరించుకుని మా బృందంతో దాండియా ఆడటం చాలా సంతోషం కలిగించింది.

– పల్లపోతు జ్యోతి, ఖమ్మం

సంప్రదాయ నృత్యంలో శిక్షణ తీసుకున్నాం



దాండియా నృత్యం కోసం డ్యాన్స్ మాస్టర్ దగ్గర శిక్షణ తీసుకున్నాం. గత సంవత్సరం 'దాండియా నైట్' వేడుకల్లో సరదాగా పాల్గొన్నాం. ఈ సంవత్సరం నెలరోజులు ముందుగానే ప్రణాళిక వేసుకున్నాం. డ్యాన్స్ మాస్టర్‌కు రూ.2 వేలు రుసుము కట్టి చేరా. స్టూడియోకు వెళ్లి నేర్చుకున్నాం. ఈ సంవత్సరం ఉత్తరాదివారిలా అలంకరించుకుని నృత్యం చేశాం.

– తడిశెట్టి శ్రీలత, ఖమ్మం

సరికొత్త ఉత్సాహం



కొత్త ఉత్సాహంతో దాండియా నృత్యం వేశాం. కిట్టీ పార్టీ తరపున పండుగల సమయాల్లో ఇంతకు ముందు కోలాటం వేసే వాళ్లం. మా బృందం తరుపున ఆధ్యాత్మిక ప్రాంతాల్లో కోలాట వేడుకల్లో పాల్గొన్నాం. ఈ సంవత్సరం మా స్నేహితులతో దాండియా నృత్య శిక్షణ తీసుకుని దసరా ఈవెంట్‌లో పాల్గొన్నాం. నృత్యంతో మా బృందంలో నయా జోష్ వచ్చింది.

– పెనుగొండ రాధ, ఖమ్మం

వైద్యసేవలకు ఊతం.. ఉపాధికి మార్గం



ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, ఖమ్మం వైద్యవిభాగం

వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించటంలో వైద్యులు కీలకంగా వ్యవహరిస్తారు. బయటకు కనిపించేది వీరే అయినా.. తెరవెనుక నుంచి వైద్యులకు సాయమందించేవారు చాలామందే ఉంటారు. ఈవిభాగంలో పారా మెడిక్‌లు(వైద్య అనుబంధ నిపుణులు) ప్రముఖ పాత్ర పోషిస్తారు. పారా మెడికల్ కోర్సుల శిక్షణకు ఖమ్మం, కొత్తగూడెంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలు వేదిక కానున్నాయి. 2024-25 విద్యా సంవత్సరానికి ఈ రెండు కళాశాలల్లో 60 చొప్పున పారా మెడికల్ సీట్లకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని తెలంగాణ పారా మెడికల్ బోర్డు(టీజీపీఎంబీ) ఆదేశించింది.

ఒక్కో కళాశాలలో రెండేసి కోర్సులు

పారా మెడికల్ విభాగంలో మొత్తం 21 కోర్సులు అందుబాటులో ఉండగా.. వీటిలో కొత్తగూడెం వైద్యకళాశాలకు డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్(డీఎల్ఎంటీ), డిప్లొమా ఇన్ డయాలసిస్), ఖమ్మంలోని ప్రభుత్వ వైద్యకళాశాలకు డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ(డీఎంఐటీ), డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నాలజీ(డీఏఎన్ఎస్) కోర్సులను కేటాయించారు. ఒక్కో కోర్సులో 30 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు.

తీరనున్న సిబ్బంది కొరత

ఖమ్మం, కొత్తగూడెంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలకు పారా మెడికల్ సీట్లు కేటాయించటంతో వైద్యసేవలు మెరుగవుతాయని పలువురు వైద్యులు చెబుతున్నారు. రెండేళ్ల వ్యవధి గల ఈ కోర్సుల్లో ఏడాది పాటు తరగతి గదిలో పాఠాలు నేర్చుకోగా.. మరో ఏడాది వైద్యులకు సహకరిస్తూ విద్యనభ్యసిస్తారు. దీనివల్ల ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత తీరనుంది. ఏటా వైద్యకళాశాల పరిధిలోని స్థానిక యువతకే పారా మెడికల్ సీట్లు కేటాయిస్తారు. విద్యాభ్యాసం అనంతరం వీరు ఈరంగంలోని ప్రభుత్వ కొలువుల కోసం పోటీపడొచ్చు. లేదా ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లలో ఉపాధి పొందవచ్చు.

వైద్యసేవల్లో పారా మెడిక్‌ల పాత్ర

- ★ రోగులను పరీక్షించటం, వ్యాధి నిర్ధారణ
- ★ ప్రత్యేకమైన సమయాల్లో అత్యవసర చికిత్స అందించటం
- ★ వెంటిలేటర్లు, డెఫిబ్రిలేటర్లు లాంటి వైద్యపరికరాల నిర్వహణ
- ★ రోగుల ఆరోగ్య సమాచారమందించటం
- ★ ప్రాథమిక చికిత్స అంశాలను నేర్పించటం

ఎంపిక విధానం..

రెండేళ్ల కాలపరిమితి గల పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఇంటర్మీడియట్‌లో బైపీసీ ఉత్తీర్ణులై ఉండాలి. బైపీసీ విద్యార్థులు లేకుంటే ఎంపీసీ విద్యార్థులకు ప్రాధాన్యమిస్తారు. ఈ రెండు గ్రూప్‌ల వారు లేకుంటే ఇతర గ్రూప్‌ల విద్యార్థులకు ప్రవేశం కల్పించే అవకాశముంటుంది. సీట్లను ప్రభుత్వ రిజర్వేషన్ల మేరకు ప్రతిభ ఆధారంగా కేటాయిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది.

నవంబర్ 25న తరగతులు ప్రారంభం

పారా మెడికల్ సీట్ల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ ఈనెల 21న వెలువడింది. ఈనెల 30 వరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించనున్నారు. కోర్సులకు ఎంపికైన విద్యార్థుల వివరాలు నవంబర్ 13న అధికారులు వెల్లడిస్తారు. ఎంపికైన వారి జాబితాపై టీజీపీఎంబీ నవంబర్ 22న తుది ప్రకటన చేస్తుంది. సీట్లు పొందిన విద్యార్థులకు నవంబర్ 25 నుంచి తరగతులు జరుగుతాయని ఖమ్మం, కొత్తగూడెం ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రిన్సిపల్స్ డా.రాజేశ్వరరావు, డా.రాజ్‌కుమార్ తెలిపారు.

ఎర్రుపాలెం మీదుగా కొత్త రైల్వే లైన్

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని దేశం నలుమూలలతో అనుసంధానించటానికి రూ.2,245 కోట్ల విలువైన 57 కిలోమీటర్ల రైల్వే లైన్‌ను కేంద్రం ప్రకటించింది. నాలుగేళ్లలో దీన్ని పూర్తి చేస్తామని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ లైన్‌తో అమరావతి నుంచి హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా, నాగ్‌పుర్, బెంగళూరుకు నేరుగా, ముంబయి, దిల్లీకి హైదరాబాద్, నాగ్‌పుర్‌ల మీదుగా అనుసంధానం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఎర్రుపాలెం నుంచి మొదలయ్యే ప్రాజెక్టు పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టిముక్కల, పరిటాల, కొత్తపల్లి, వడ్లమాను, అమరావతి, తాడికొండ, కొప్పవరం మీదుగా నంబూరు వరకు సాగుతుంది.

70 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

కొత్తగూడెం సింగరేణి: సింగరేణిలో మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయంలో గురువారం పరిశీలించారు. వివిధ విభాగాల్లో 139 ట్రైనీ పోస్టుల భర్తీకి గతంలో నిర్వహించిన రాత పరీక్షల ఫలితాలు ఇటీవల వెల్లడైన విషయం తెలిసిందే. తొలిరోజు 70 మంది ధ్రువపత్రాలను జీఎం శామ్యూల్ సుధాకర్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ చేశారు. మిగతా వారి పత్రాలను శుక్రవారం పరిశీలించనున్నారు.

మెడికల్ బోర్డుకు 179 మంది హాజరు

కొత్తగూడెం సింగరేణి: సింగరేణి ప్రధాన వైద్యశాలలో మెడికల్ బోర్డు గురువారం ప్రారంభమైంది. తొలిరోజు వైద్యపరీక్షలకు 179 మంది కార్మికులు హాజరయ్యారు. మొత్తం 204 మందికి మెడికల్ బోర్డు నుంచి పిలుపు అందింది. హైదరాబాద్ నుంచి రానున్న వైద్యనిపుణులు శుక్రవారం పరీక్షల నివేదికల ఆధారంగా వైద్యపరంగా అనర్హులైన వారిని ఎంపిక చేస్తారు.

నేడే దీపావళి బోనస్ విడుదల

కొత్తగూడెం సింగరేణి: దీపావళి (పీఎల్ఆర్) బోనస్‌ను సింగరేణి యాజమాన్యం కార్మికుల బ్యాంకు ఖాతాల్లో శుక్రవారం జమచేయనుంది. ఒక్కో ఉద్యోగికి బోనస్‌గా రూ.93,750 చెల్లించనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది.

బాధ్యతల బరువు.. కానరాని ఆదెరువు


తమ్ముడు సైదిబాబుకు సపర్యలు చేస్తున్న శైలజ

ఆమె తల్లిదండ్రులకు అమ్మయింది. తమ్ముడి భారం భూజాన వేసుకుంది. కడుపున పుట్టిన ముగ్గురిని చదివిస్తోంది. అనారోగ్యంతో కునారిల్లుతున్న కుటుంబ సభ్యులను ఆదుకోవాలని, ప్రభుత్వం చేయూత అందించాలని వేడుకుంటోంది ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం గోపాలపురానికి చెందిన శైలజ. భర్త లేకపోవడంతో ఈమె పిల్లలతోపాటు తల్లిదండ్రుల వద్దకు వచ్చి గోపాలపురంలో ఉంటోంది. తండ్రి వీరాస్వామికి రోడ్డు ప్రమాదంలో కాళ్లు విరిగిపోయాయి. తల్లి బేబీ మెదడులో రక్తం గడ్డకట్టి బాధపడుతోంది. నెలకు వీరిద్దరి వైద్య ఖర్చులకే రూ.10 వేలు అవుతోంది. వీరికి తోడు దివ్యాంగుడైన తమ్ముడు సైదిబాబును ఈమే చూసుకుంటోంది. నగరంలోని ఓ హోటల్‌లో పని చేసి ముగ్గురు పిల్లల(ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి)ను చదివిస్తోంది. అక్కడ మిగిలిన ఆహారం, కూరలు తెచ్చుకొని పూట గడుపుతున్న దయనీయమైన పరిస్థితి వీరిది. సొంత ఇల్లు లేదు. నెలకు రూ.3 వేలు చెల్లించి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. తండ్రి కాళ్లలో అమర్చిన రాడ్లు తొలగించేందుకు శస్త్ర చికిత్స చేయించాల్సి ఉంది. పూట గడవడమే గగనమైన పరిస్థితిలో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తోంది శైలజ. ప్రభుత్వం ఆసరా పింఛను, ఇల్లు మంజూరు చేయాలని చేతులెత్తి వేడుకుంటోందా కుటుంబం. – ఈనాడు, ఖమ్మం

కానిస్టేబుల్ బ్యాచ్ @ 1984



ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: వారంతా 1984 బ్యాచ్ పోలీసు ఉద్యోగులు. శాఖలో పని చేస్తూ ఉద్యోగోన్నతులు పొంది ప్రస్తుతం హెడ్ కానిస్టేబుల్, ఏఎస్సై, ఎస్సై హోదాల్లో పలు పోలీసు స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన వీరంతా ఒకచోట కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఖమ్మం నగరంలోని ఓ ఫంక్షన్ హాలు ఈ వేడుకకు వేదికైంది. 1984 బ్యాచ్ కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనం గురువారం నిర్వహించుకున్నారు. మొత్తం 105 మంది ఉండే బ్యాచ్‌లో ప్రస్తుతం 41 మంది సర్వీసులో ఉన్నారని, 39 మంది ఉద్యోగ విరమణ చేశారని నిర్వాహకులు తెలిపారు. 25 మంది కన్ను మూసినట్లు చెప్పారు. మృతుల కుటుంబాలను ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు.

రాములోరికి పునర్వసు పూజలు

భద్రాచలం, దుమ్ముగూడెం: పునర్వసును పురస్కరించుకుని భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి, పర్ణశాల రామాలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. మాడవీధులన్నీ రామ నామాలతో మార్మోగాయి. వైష్ణవ సంప్రదాయం ప్రకారం విష్వక్సేనుణ్ని పూజించి పుణ్యాహ వాచనం నిర్వహించారు. మాంగళ్యధారణ తలంబ్రాల వేడుక చేశారు. దర్బారు సేవలో స్వామి వైభవం మరింత పెరిగింది.

భక్త రామదాసు ధ్యాన మందిర సందర్శన

నేలకొండపల్లి: నేలకొండపల్లిలోని భక్తరామదాసు ధ్యాన మందిరాన్ని కళాశాల విద్య మల్టీజోన్-1 జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్ గురువారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మందిర పూజారి సౌమిత్రి రమేష్ ధ్యాన మందిర విశిష్టతను తెలియజేశారు. నేలకొండపల్లి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలను తనిఖీ చేశారు. ప్రిన్సిపల్ ఆలేటి పరంజ్యోతి, అధ్యాపకులు శ్రీనివాసరావు, వెంకటరాజం తదితరులు పాల్గొన్నారు.

అడవిలో దారితప్పిన యువకుడు.. కాపాడిన పోలీసులు


బయటకు తీసుకొచ్చిన యువకుడితో పోలీసులు, గ్రామస్థులు

మల్హర్, న్యూస్‌టుడే: అటవీ ప్రాంతంలో దారితప్పిపోయిన యువకుడిని పోలీసులు రక్షించారు. ఖమ్మంకు చెందిన జస్వ అనే యువకుడు ద్విచక్రవాహనంపై పని నిమిత్తం మంచిర్యాల వెళ్లి బుధవారం తిరుగు పయనమయ్యారు. మల్హర్ మండలం కిషన్‌రావుపల్లి నుంచి అడవిలోని కాలిబాట ద్వారా భూపాలపల్లి చేరుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో కిషన్‌రావుపల్లికి చేరుకోగానే చీకటిపడింది. గూగుల్ మ్యాప్ ఆధారంగా వెళ్తుండగా.. రాత్రి 11.30 గంటల సమయంలో అడవిలో దారితప్పిపోయాడు. ద్విచక్రవాహనం చెడిపోయింది. చిమ్మచీకట్లో ఎటూవెళ్లలేని పరిస్థితి. భయాందోళనకు గురై 100 నెంబర్‌కు ఫోన్ చేశారు. స్పందించిన కొయ్యూర్ ఎస్సై నరేష్ భయపడొద్దని ఎప్పటికప్పుడు ధైర్యం చెప్పారు. గ్రామస్థుల సహకారంతో దాదాపు రెండు గంటల పాటు అడవిలో వెతికారు. ప్రాణ భయంతో ఉన్న జస్వను ఎట్టకేలకు బయటకు తీసుకురావడంతో ఉత్కంఠ వీడింది. చెడిపోయిన ద్విచక్రవాహనానికి మరమ్మతు చేయించి ఎస్సై సురక్షితంగా ఇంటికి పంపించారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో లేఖ రచన పోటీలు

ఖమ్మం క్రీడలు: తపాలాశాఖ లేఖరచన పోటీలు నిర్వహించేందుకు ఆ శాఖ తేదీలు ప్రకటించింది. లేఖలు ఈనెల 14 నుంచి డిసెంబరు 14 లోగా పంపాల్సి ఉంటుంది. 'డిజిటల్ యుగంలో ఉత్తరాల ప్రాధాన్యం' అనే అంశంపై హిందీ, ఆంగ్లం, ప్రాంతీయ భాషల్లో ఇన్‌ల్యాండ్ లెటర్, కార్డుపై 500 పదాలకు మించకుండా, ఎన్వలప్ కవర్లో ఏ4 సైజులో 1,000 పదాలకు మించకుండా రాయాలి. 18 ఏళ్లలోపు, ఆపై వయసుల వారు ఇలా రెండు విభాగాల్లో పోటీలు ఉంటాయి. ఈ లేఖలను డిసెంబరు 14 లోగా చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్, హైదరాబాద్ చిరునామాకు పంపించాలని ఖమ్మం డివిజన్ తపాలా అధికారి వీరభద్రస్వామి సూచించారు.

నార్కోటిక్ డ్రగ్స్ అధికారుల తనిఖీలు



ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: నార్కోటిక్ డ్రగ్ పోలీసు అధికారులు ఖమ్మం నగరంలో వాహన తనిఖీలను గురువారం రాత్రి తనిఖీ చేశారు. ఇల్లెందు క్రాస్ రోడ్డులో పలు కార్లను ఆపిన వారు క్షుణ్ణంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇవి సాధారణంగా జరిగే తనిఖీలేనని, ఎటువంటి మత్తు పదార్థాలు పట్టుబడలేదని ఖమ్మం రెండో పట్టణ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు.

చిన్నారుల బ్యాక్వార్డు స్కేటింగ్ సాహస యాత్ర


బ్యాక్వర్డ్ స్కేటింగ్ చేస్తున్న చిన్నారులు

కూసుమంచి, న్యూస్‌టుడే: ప్రపంచ రికార్డు సృష్టించాలనే లక్ష్యంతో బాల సోదరులిద్దరూ హైదరాబాద్ నుంచి భద్రాచలం వరకు 300 కిలోమీటర్ల బ్యాక్వార్డు స్కేటింగ్ యాత్రను గురువారం చేపట్టారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీ ప్రాంతం నుంచి యాత్ర ప్రారంభమైంది. స్కేటింగ్ యాత్రికులు రాజేష్‌కుమార్(8), ఉమేష్‌కుమార్(7) మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడేనికి చేరుకున్నారు. తల్లిదండ్రులు, కోచ్‌లు, స్కేటింగ్ సహచరులు, గిన్నిస్‌బుక్ రికార్డు నమోదు జడ్జీల తోడుగా జాతీయ రహదారిపై ఈ సోదరుల స్కేటింగ్ యాత్ర కొనసాగింది. వీరికి నాయకన్‌గూడెంలో స్థానిక నాయకులు స్వాగతం పలికారు. గతంలో నమోదైన 200 కి.మీ. గిన్నిస్‌బుక్ రికార్డును 300 కి.మీ. బ్యాక్వార్డ్ స్కేటింగ్‌తో తమ పిల్లలు అధిగమించబోతున్నారని రాజేష్‌కుమార్, ఉమేష్‌కుమార్ తండ్రి నవీన్‌కుమార్ చెప్పారు. బాలికల రక్షణతో పాటు మత్తుపదార్థాలను నిర్మూలించాలంటూ చేపట్టిన ఈ యాత్రకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించిందన్నారు. తమది ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామమని, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నట్లు వివరించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను అపహరించిన ముగ్గురు అంతర్రాష్ట్ర నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 19 ద్విచక్ర వాహనాలను స్వాధీనపరచుకున్నారు. ఏలూరు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ గురువారం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏడాదిగా నూజివీడు టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో 6, ఎ.కొండూరు-1, మచిలీపట్నం-1, మైలవరం-2, తిరువూరు-1, ఒంగోలు-1, విజయవాడ కృష్ణలంక-2, సత్తుపల్లి-1, చింతలపూడి స్టేషన్ పరిధిలో ఒక ద్విచక్ర వాహనాలను ముగ్గురు దుండగులు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆయా ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి. నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో నూజివీడులో టౌన్ సీఐ సత్య శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి రాజీవ్ సర్కిల్ వద్ద గురువారం ఓ ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వెళుతున్న ముగ్గురిని ఆపి విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వేంసూరు మండలం కల్లూరుకు చెందిన బత్తుల పవన్‌కల్యాణ్, అదే గ్రామానికి చెందిన భీమిరెడ్డి సీతారామిరెడ్డి, దూళ్లకొత్తూరుకు చెందిన దనికొండ రమేష్ నిందితులు అని ఎస్పీ పేర్కొన్నారు. పవన్ కల్యాణ్, రమేష్ ఇద్దరూ చిన్ననాటి స్నేహితులు. డబ్బులు సులభంగా సంపాదించాలని సీతారామిరెడ్డిని కలుపుకొని చోరీలకు పాల్పడుతున్నారని వివరించారు.

నాణ్యమైన వంట పాత్రలు అందించాలి

భద్రాచలం: గిరిజన విద్యాలయాలకు నాణ్యమైన వంట పాత్రలను అందించాలని గిరిజన సంక్షేమ శాఖ ఖమ్మం డీడీ విజయలక్ష్మి తెలిపారు. ఖమ్మం జిల్లాలోని మెట్రిక్ వసతిగృహాలకు అవసరమైన వంట గిన్నెలు, ప్లేట్లు, గ్లాసులు, గ్రైండర్లు, కుక్కర్ల సరఫరాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో గురువారం నిర్వహించారు.

కుమార్తెను వ్యభిచార కూపంలోకి నెట్టిన తల్లికి జీవిత ఖైదు

రంగారెడ్డి జిల్లా: కుమార్తెను వ్యభిచార వృత్తిలోకి దింపిన మహిళకు న్యాయస్థానం జీవితఖైదుతోపాటు రూ.2,96,000 జరిమానా విధించింది. ఖమ్మం నగరానికి చెందిన ఓ మహిళ(35) భర్త చనిపోవడంతో ఇద్దరు కుమార్తెలతో కలిసి హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో పని చేసేది. విలాసాలకు అలవాటుపడ్డ ఆమె డబ్బు కోసం వ్యభిచార వృత్తి ఎంచుకుంది. ఆమె పెద్ద కుమార్తె(21) ప్రేమ వివాహం చేసుకొని భర్తతో కలిసి హయత్‌నగర్‌లో స్థిరపడింది. రెండో కుమార్తె(16)ను డబ్బుల కోసం వ్యభిచారం చేయాలని తల్లి బలవంతం చేయగా బాలిక నిరాకరించింది. ఈ క్రమంలో బాలికను ఖమ్మంలోనే వ్యభిచారం నిర్వహించే కుక్కల ఆశ(25)కు విక్రయించింది. చెర నుంచి తప్పించుకున్న బాలిక హయత్‌నగర్‌లో ఉండే అక్క ఇంటికి చేరుకుంది. ఆమె తల్లి, ఆశ మరికొందరు కలిసి హయత్‌నగర్‌కు వచ్చి బాలికను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు వారిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. కేసు విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి హరీశ.. రెండో నిందితురాలైన బాలిక తల్లికి శిక్ష విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. బాధితురాలికి రూ.12లక్షలు పరిహారం మంజూరు చేశారు. ఆశ కోర్టుకు రానందున ఆమెపై బెయిలుకు వీల్లేని వారెంటు జారీ చేస్తూ విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

హత్య కేసులో నిందితుల రిమాండ్

జూలూరుపాడు: చేతబడి అనుమానంతో జరిగిన ఓ వ్యక్తి హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి కథనం ప్రకారం.. రాచబండ్లకోయగూడేనికి చెందిన కుంజా ప్రవీణ్, అతడికి వరసకు మామ అయిన మల్కం గంగయ్య అలియాస్ గంగులు కలిసి అదే గ్రామానికి చెందిన కుంజా భిక్షం(42)ను చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో హత్య చేశారు. ప్రవీణ్ తల్లి అనారోగ్యానికి భిక్షం కారణమని ఇలా చేశారు. గ్రామంలో ఈనెల 21న ఓ యువకుడి కర్మకాండలు నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రవీణ్, గంగయ్య హాజరయ్యారు. ఈ మేరకు మందు తాగుదామంటూ భిక్షాన్ని వెంటబెట్టుకుని సమీపంలోని వేపలవాగు వద్దకు వెళ్లారు. అక్కడ మద్యం తాగి రాయితో కొట్టి భిక్షాన్ని హత్య చేశారని సీఐ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

దుమ్ముగూడెం: రోడ్డు ప్రమాదంలో యువకుడు గురువారం మృతి చెందారు. కొత్తనారాయణరావుపేటకు చెందిన పాయం జంపన్న(19) తన స్నేహితుడు కొమరం వీరయ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై లక్ష్మీనగరం వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో చినార్లగూడెం కొంగవాగు పాఠశాల సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పటంతో కిందపడ్డారు. తీవ్రగాయాలపాలైన జంపన్న అక్కడికక్కడే మృతిచెందారు. అపస్మారకస్థితికి చేరుకున్న వీరయ్యను స్థానికులు 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు..

కూసుమంచి: మల్లేపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జుజ్జులరావుపేటకు చెందిన ఐతం అనిల్(31) మృతిచెందారు. సుతారి పనులు చేస్తూ జీవనం గడుపుతున్న అనిల్ ముదిగొండ మండలం మాదాపురం వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగొస్తుండగా మల్లేపల్లి సమీపంలో ఎదురుగా అతివేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. అతడి తలకు బలమైన గాయమైంది. స్థానికులు 108 వాహనంలో నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనిల్ బంధువు మైసయ్య ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ నామవరపు వెంకటేశ్వర్లుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో యువతి బలవన్మరణం

తిరుమలాయపాలెం: చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన ఘటనపై గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. ఏలువారిగూడేనికి చెందిన యువతి(17) పిండిప్రోలు ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో మరిపెడ మండలం చిల్లంచర్లకు చెందిన మాతంగి విష్ణుతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమగా మారింది. కొంతకాలం ప్రేమించుకున్న తరువాత ఆమెను పెళ్లి చేసుకోనని విష్ణు తేల్చిచెప్పాడు. మనస్తాపానికి గురైన ఈనెల 23న గడ్డి మందు తాగింది. ఖమ్మంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం చనిపోయింది. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు విష్ణుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: బాలికను నమ్మించి లైంగికంగా దాడి చేసిన యువకుడిపై ఖమ్మం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ కథనం ప్రకారం... నగరంలోని పాఠశాలలో 14 ఏళ్ల బాలిక పదో తరగతి చదువుతోంది. మూడు నెలలుగా బంధువైన 25 ఏళ్ల యువకుడు ఆమెను పాఠశాలలో దింపుతానంటూ తీసుకెళ్తూ మాయమాటలతో లొంగదీసుకున్నాడు. పలుమార్లు ఆమెపై లైంగిక దాడి చేశాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

విదేశీ కొలువు.. స్పందన కరవు!

టామ్‌కామ్ ముఖాముఖికి 9 మందే..!

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే


ఉద్యోగాల కోసం వచ్చిన అభ్యర్థులు

దుబాయ్‌లో డెలివరీ బాయ్స్‌గా పని చేయాలనుకునే ద్విచక్ర వాహన చోదకులు(బైక్ రైడర్ల)కు చాలా డిమాండ్ ఉంది. పదో తరగతి విద్యార్హత, మూడేళ్ల డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు ఉన్న 21 నుంచి 40 ఏళ్లలోపు వారు అర్హులు. ఖమ్మం జిల్లాలో ఆసక్తి ఉన్న వారి కోసం ఉపాధి కల్పన శాఖ గురువారం ఖమ్మం మోడల్ కెరీర్ సెంటర్లో దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నిర్వహించింది. ఆశావహులు వచ్చినప్పటికీ వీరిలో 9 మందికి మాత్రమే పాస్‌పోర్టులున్నాయి. ఇందులోనూ తుది పరిశీలన వరకు ఎందరు మిగులుతారో వేచి చూడాలి. ప్రభుత్వం టామ్‌కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో కొలువులను వెతికి, ఇక్కడి నుంచి వెళ్లేవారి కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. పూర్తి ప్రభుత్వ భద్రత, భరోసాతో అభ్యర్థులను విదేశీ కొలువులకు పంపుతున్నారు. బైక్ రైడర్లు జిల్లాలో చాలామంది ఉన్నారు. ఆహార డెలివరీ సంస్థల్లో వందల మంది పని చేస్తున్నారు. ముందుగా అవగాహన కల్పించి ఉంటే విదేశీ కొలువులకు వచ్చే వారి సంఖ్య పెరిగేదనే చర్చ ఉంది. వచ్చిన అభ్యర్థుల్లో చాలామంది విదేశాల్లో ఇలాంటి అవకాశాలు ఉన్నాయని ముందస్తు సమాచారం ఉంటే అందుకు తగిన విధంగా అన్ని సమకూర్చుకునేవాళ్లమని చెప్పారు. అన్ని అర్హతలు ఉన్నాయి. ఇప్పటికిప్పుడు పాస్‌పోర్టు కావాలంటే రాదు కదా? అని వచ్చిన వారిలో కొందరు నిరాశ వ్యక్తం చేశారు. టామ్‌కామ్ సంస్థ విదేశాల్లో కొలువులు చూపిస్తోందని అంటున్నారు. అందుకు తగిన సమాచారం ఇక్కడ స్థానిక కార్యాలయంలో ఉండటం లేదని, మొత్తం హైదరాబాదులోనే.. ఇక్కడేమీ లేదని చెబుతుంటే కనీస సమాచారం మాకు అందేదెప్పుడని ఒకరిద్దరు ఆవేదన చెందారు. దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని జిల్లా ఉపాధి కల్పన అధికారి మాధవి పర్యవేక్షించారు.

వైద్య విద్యార్థినులకు ఐటీడీఏ సాయం



సాత్వికకు రూ.50 వేల చెక్కు అందిస్తున్న పీఓ రాహుల్, చిత్రంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఆర్సీఓ నాగార్జునరావు, డీడీ విజయలక్ష్మి

భద్రాచలం, న్యూస్‌టుడే: పేద కుటుంబాలైనప్పటికీ ఇష్టపడి చదివి లక్ష్యం దిశగా సాగుతూ ఎంతో మందికి ఆదర్శనీయంగా నిలుస్తున్న ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో సీటు సాధించిన విద్యార్థినులను ఐటీడీఏ పీఓ రాహుల్ అభినందించారు. తన కార్యాలయంలో వీరికి గురువారం రూ. 50 వేల చొప్పున చెక్కులు అందించారు. భద్రాచలం గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి లాంగ్‌టర్మ్ కోచింగ్ పొందిన విద్యార్థినులు నీట్‌లో సత్తాచాటారని వెల్లడించారు. గుండాల మండలం పోలారం గ్రామానికి చెందిన వి.వీరకుమారి, ఇదే మండలానికి చెందిన అమృత రాణి, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం బూటారంకు చెందిన కె.సాత్విక, అదే జిల్లా వెంకటాపురానికి చెందిన పి.గీతాంజలికి చెక్కులు అందించారు. ఇదే స్ఫూర్తితో వైద్య వృత్తిలో రాణించాలని ఆకాంక్షించారు. కోర్సు పూర్తయ్యాక నిరుపేదలకు వైద్యసేవలు అందించాలని సూచించారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఆర్సీఓ నాగార్జునరావు, ఖమ్మం డీడీ విజయలక్ష్మి, ఏఏ రాంబాబు పాల్గొన్నారు.

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

మొక్కలు నాటిన గ్రీన్ భద్రాద్రి

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలో కృష్ణసాగర్ బాలికల కళాశాల ఆవరణలో ఐటీడీఏ పీఓ రాహుల్ గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించడం ఎంతో ముఖ్యమన్నారు. ఉమా శంకర్‌నాయుడు, రాంబాబు, సూర్యనారాయణ, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని బ్యాంకు సమీపంలో రుతురమాళ్ల తయారీ కేంద్రం వద్ద విద్యుత్తు స్తంభానికి ఉన్న సర్వీసు వైర్లు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. **- సుబ్బారావు, స్థానికుడు**

సమాధానం: సర్వీసు వైర్లు కిందకు వేలాడుతున్నట్లు తెలిసింది. వెంటనే ఈ సమస్యను పరిష్కరిస్తాం. **- రాజారావు, ఏఈ**

- భద్రాచలం, న్యూస్‌టుడే

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

అశ్వాపురం, న్యూస్‌టుడే: మొండికుంట గ్రామానికి చెందిన జంగిలి సోమయ్య ఇటీవల మృతి చెందారు. మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి గురువారం రూ.11,500 ఆర్థికసాయం అందజేశారు. అధ్యక్షుడు కమటం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కాసరబాద రాములు, యువజన సంఘం మండల అధ్యక్షుడు పర్వత నరేశ్, నాయకులు నర్సయ్య, చంద్రరావు, సాంబశివరావు, శ్రీను, నరేశ్, ప్రభాకర్, దండి రాములు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ముసలిమడుగులో అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ద్వారక జ్యోతిర్లింగ క్షేత్రం వ్యవస్థాపకులు శివనాగస్వామి గురువారం వితరణ చేశారు. వాగే సత్యం అనే బాధితుని పూరిల్లు ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి సర్వం కాలిపోయింది. మానవతా దృక్పథంతో శివనాగస్వామి స్పందించి రూ. పది వేల నగదు, 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు, దుస్తులు అందజేశారు. మహేష్, భార్గవ్, కృష్ణ, హరికృష్ణ, ఖాదర్‌బాబు పాల్గొన్నారు.



వితరణ అందజేస్తున్న ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి

అభివృద్ధిపై ఆశలు

మణుగూరు, న్యూస్‌టుడే

మణుగూరు మండలంలో అటవీ గ్రామాలు అనగానే బుగ్గ, కంభంతోగు పేర్లు ప్రస్తావనకు వస్తాయి. వాటిని ఇప్పుడు సింగరేణి సమీప గ్రామాలుగా గుర్తించారు. ఉపరితల గనుల విస్తరణ, కొండాపురం గనితో ఈ గ్రామాలు సింగరేణికి కూతవేటు దూరంగా వచ్చేసింది. దీంతో గ్రామ ప్రజలు అభివృద్ధి జరుగుతుందని ఆశిస్తున్నారు. బొగ్గు గనులు సమీపంలోకి రావడంతో సింగరేణి యాజమాన్యం ఆయా గ్రామాలపై దృష్టి సారించింది. సేవా సమితి పేరుతో ఇప్పటికే ఆయా గ్రామాల్లో సింగరేణి వైద్యశిబిరాలు నిర్వహిస్తోంది. గ్రామస్థులందరూ సింగరేణి వైద్యం పొందుతున్నారు. అయితే అంబులెన్సు వెళ్లేందుకు రహదారి లేకపోవడంపై సింగరేణి యజమాన్యానికి ఫిర్యాదులు అందాయి. గ్రామానికి గ్రావెల్ రహదారిని నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుందని గ్రామస్థులు ఇప్పటికే సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. అయితే గ్రామానికి వెళ్లాలంటే రెండు వంతెనల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. సింగరేణి సమీప గ్రామాలు కావడం మూలంగా ఆయా గ్రామాలను యాజమాన్యం దత్తత తీసుకుంటే సమస్య పరిష్కారం అవుతుంది. ఇదే విషయంపై గ్రామస్థులు ఇటీవల జిల్లా కలెక్టర్‌ను ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయా గ్రామాల వివరాలను కలెక్టరు సేకరించారు. జిల్లా కలెక్టరు దగ్గర నుంచి కూడా సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు అందినట్లు తెలిసింది. ఈ గ్రామాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం కార్పొరేటుకు కలెక్టరు కార్యాలయం నుంచి సూచనలు వెళ్లాయి.



వాగు పక్కకు వచ్చిన పైపులు

30 ఏళ్లుగా..

సుమారు మూడు దశాబ్దాల క్రితం బుగ్గ, కంభంతోగు గ్రామాలు వెలిసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతంలో రహదారి ఉండేదికాదు. దీంతో అధికారులు ఇటువైపునకు వెళ్లేవారు కాదు. దీంతో గ్రామాలకు ఎలాంటి అభివృద్ధి పనులు మంజూరు కాలేదు. ఈ గ్రామాల్లో ఎక్కువగా గిరిజనులు ఉన్నారు. సింగరేణి బొగ్గును సమీపంలోకి రావడంతో గ్రామస్థుల్లో కొంత విశ్వాసం పెరిగింది. తమ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. ఈ గ్రామాలకు సమీపంలోకి వెళ్లిన సింగరేణి యాజమాన్యం గ్రామస్థుల కోరికల విషయంలో ఎలా స్పందిస్తుందనే విషయంపై ఎదురు చూడాల్సిందే. ఈ విషయంపై ఏరియా సింగరేణి ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లును 'న్యూస్‌టుడే' సంప్రదించగా... గ్రామాలకు వెళ్లే దారిలో కల్వర్టులపై పైపులను సరిచేస్తామన్నారు. గ్రామాల అభివృద్ధికి సింగరేణి కట్టుబడి ఉందన్నారు. అటవీ శాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో ముందడుగు వేయలేదన్నారు.

తూర ఏర్పాటు

స్పందనకు వందనం

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: ఎట్టకేలకు రహదారులు భవనాల శాఖ అధికారులు నారాయణపురం-బచ్చువారిగూడెం మార్గంలో తూర ఏర్పాటు చేశారు. ఈ నెల 15న రహదారికి అడ్డుగా తూరపెట్టకుండా మట్టిపోయడంతో చిన్నంశెట్టి కృష్ణారావు పొలం నీట మునిగిన వైనంపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు గురువారం నీళ్లు బయటకుపోయే ఏర్పాటు చేశారు.

రామానుజవరంలో ఉచిత వైద్యశిబిరం

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులోని రామానుజవరంలో గురువారం సింగరేణి వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, మహిళలు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అందరికీ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. డాక్టర్ సులోచనారాణి, స్టాఫ్‌నర్స్ విద్యారాణి, సిబ్బంది రాము, మారేశ్వరరావు, యూసఫ్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అలసిన రైతులకు విశ్రాంతి

మణుగూరు-అశ్వాపురం ప్రధాన రహదారికి కొంతదూరంలో పొలాల వద్ద కూర్చునే బల్లను ఏర్పాటు చేశారు. రైతుల కోసం కూడా ఆలోచించి ఈ బల్లను వేయడం విశేషం. సహజంగా ఈ బల్లలు జనసంచారం, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేస్తారు. ఇక్కడ మాత్రం రైతుల కోసం ఏర్పాటు చేయడం గమనార్హం. ఇలాంటి బల్లలు పొలాల్లో చెట్ల కింద అక్కడక్కడ ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనంగా ఉంటుంది. చేను పనులు చేసి అలసిసొలసిన రైతులు కూర్చొని సేద తీరవచ్చు.

– మణుగూరు, న్యూస్‌టుడే



కనుచూపు మేర.. పచ్చదనమే




కనుచూపు మేర పచ్చదనం చూపరులను కనువిందు చేస్తోంది. బూర్గంపాడు మండలం ఇరవెండిలో రైతులు పెద్దఎత్తున వరి సాగు చేశారు. ఏపుగా పెరిగిన వరి పంట పచ్చదనంతో కళకళలాడుతోంది. రహదారికి ఇరువైపులా ఉన్న పంటలు చూపరులకు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. ఈ చిత్రాన్ని 'న్యూస్‌టుడే' ఛాయాగ్రాహకంలో నిక్షిప్తం చేసింది.

– బూర్గంపాడు, న్యూస్‌టుడే

ప్రకృతి.. ఆకృతి

ప్రకృతి పచ్చరంగుతో వేసిన చిత్రమిది. చూపును కట్టివేసే పచ్చని అల్లికిది. కొత్త ఆకారాలకు పురుడుపోసిన వైనమిది. ఇంతటి ప్రకృతి సౌందర్యం మణుగూరు మండలం తోగ్గూడెం నుంచి పాములపల్లికి వెళ్లే రహదారిలో కనిపిస్తుంది.

– మణుగూరు, న్యూస్‌టుడే



గ్రామీణ ప్రాంత సమస్యలు పరిష్కరించాలి: తెజస

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ జన సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌ఛార్జి గోపగాని శంకర్‌రావు అన్నారు. ఆళ్లపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు ఆచార్య కోదండరాం భద్రాచలం సీతారామ చంద్రస్వామిని దర్శించుకున్న అనంతరం పాల్వంచ వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నుంచి చేరికలు ఉన్నట్లు పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్‌కే నబీ సాబ్, జిల్లా నాయకులు ఖదర్‌బాబా, యువజన నాయకులు రాము, తెలంగాణ ఉద్యమ నాయకులు గుంతోజు మధుసూదనచారి, మండల నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం ఎంవీఐగా ఎస్‌వీ పుల్లయ్య



భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం ఎంవీఐగా సంగం వెంకటపుల్లయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌ఛార్జిగా మనోహర్ పని చేశారు. మహబూబాబాద్ నుంచి బదిలీపై వచ్చిన ఎంవీఐ ఎస్‌వీ పుల్లయ్య పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎంవీఐ కార్యాలయం ఆవరణలో పలు రకాలు మొక్కలు నాటారు. వాహనదారులు తమ వాహనం రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత తమకు నచ్చిన చోట ఓ మొక్కను నాటాలని సూచించారు.

అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలు

గుండాల, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షానికి గుండాల మండలంలోని వివిధ గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలు నేలకూలి దెబ్బతిన్నాయి. ప్రస్తుతం పంటలు చేతికందే దశకు చేరుకున్నాయి. ఇటీవల గాలి దుమారంతో ఈదురు గాలులు వీచాయి. ఈ నేపథ్యంలో పంటలు నేలమట్టమయ్యాయి. దీంతో నష్టం వాటిల్లిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సభను జయప్రదం చేయండి

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: మందకృష్ణ మాదిగ నేడు ఖమ్మంలో తలపెట్టిన మాదిగల ధర్మయుద్ధ మహాసభను జయప్రదం చేయాలని ఆళ్లపల్లి మాదిగల రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్పీఎస్) అధ్యక్ష, ఉపాధ్యక్షులు కండె రాంబాబు, వి.నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోండి

ములకలపల్లి, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని పీసా కమిటీ ఉపాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. మూకమామిడిలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరుతూ పీసా కమిటీ, మూకమామిడి గ్రామస్థుల ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ పుల్లారావుకు వినతిప్రతం అందజేశారు. వీరస్వామి, నవీన్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్

ములకలపల్లి, న్యూస్‌టుడే: హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. నర్సాపురంలో గురువారం ఏర్పాటు చేసిన మండల మహాసభలో పాల్గొని మాట్లాడారు. యూసఫ్, జబ్బార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాత పుస్తకాల పంపిణీ

చర్ల, న్యూస్‌టుడే: బూరుగుపాడు, బోదనెల్లి, చింతగుప్పతోపాటు ఆర్.కొత్తఎస్సీ కాలనీలోని పాఠశాల విద్యార్థులకు వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాతపుస్తకాలు, పెన్నులను గురువారం పంపిణీ చేశారు. ఆర్.కొత్తగూడానికి చెందిన ప్రముఖుడు జోగిరాజు చేతుల మీదుగా వీటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. వసుధ ఫౌండేషన్ నేతృత్వంలో ప్రతిఏటా రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల విద్యార్థులకు రాత పుస్తకాలను పంపిణీ చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. మాజీ సర్పంచి తుర్రం రవికుమార్, కాకా నర్సింహారావు, కె.వెంకటేశ్వర్లు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం ఇవ్వండి

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఊట్లపల్లి వెంకమ్మ చెరువు వరద కాలువ కారణంగా భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి రూ. 8 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ఆధార్ పార్టీ జిల్లా ఛైర్మన్ కేశవ్‌గౌడ్ డిమాండ్ చేశారు. అశ్వారావుపేట తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. రాజులు, నాగేశ్వరరావు, కష్ణ పాల్గొన్నారు.

సతీష్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతి

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదివాసీ బిడ్డలమైన తమను మోసం చేసిన అటవీ హక్కుల ఛైర్మన్ సతీష్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్దిపల్లి రైతులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కోరారు. మణుగూరులోని ప్రజాభవన్‌లో గురువారం పాయంను కలిసి వినతిపత్రం అందజేశారు. వారిలో రైతులు జోగయ్య, భీమయ్య, పెద్దసోమయ్య, బాబురావు, దేవయ్య, భద్రయ్య, ఉంగయ్య తదితరులు పాల్గొన్నారు.

✦ తోగ్గూడెం పంచాయతీ గోపాలరావుపేట యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దీపావళి మెగా వాలీబాల్ టోర్నమెంట్‌కు సంబంధించి కరపత్రాలను గురువారం స్థానిక ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. పార్టీ మండలాధ్యక్షుడు పీర్నాకి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పాయంకు వినతిపత్రం అందజేస్తున్న పెద్దిపల్లి రైతులు

వంతెనల మంజూరుపై హర్షం



పోచంపల్లివాగు వద్ద ఆనందం వ్యక్తం చేస్తున్న పగిడేరు గ్రామస్థులు

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులోని పగిడేరులో పోచంపల్లివాగు, పిత్రువాయి వాగులపై హైలెవల్ వంతెనలు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గురువారం పోచంపల్లివాగు వద్ద సమావేశమైన రైతులు మాట్లాడుతూ... ప్రతి వర్షాకాలంలో ఈ వాగుల కారణంగా గ్రామస్థులు పడుతున్న బాధలకు ఇన్నేళ్ల తర్వాత మోక్షం కలిగిందంటూ ఆనందం వ్యక్తం చేశారు. జై పాయం అంటూ నినాదాలు చేశారు. పార్టీ నాయకులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వంతెనను ఢీకొన్న ట్రాక్టర్

దమ్మపేట, న్యూస్‌టుడే: పాల్వంచ-దమ్మపేట ప్రధాన రహదారిలోని ఎర్రన్నపేట వంతెన గోడను ఓ ట్రాక్టర్ బుధవారం రాత్రి ఢీకొంది. లోడుతో వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ మద్యం మత్తులో గోడను బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ముందు భాగం నుజ్జునుజ్జయింది.

వివాహిత బలవన్మరణం

ములకలపల్లి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. సాగివాగు గ్రామానికి చెందిన మడకం ఇరువమ్మ(40) కొంతకాలంగా నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. బుధవారం నరాల నొప్పులు తీవ్రం కావడంతో పురుగు మందు తాగారు. కుటుంబ సభ్యులు సర్వజనాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



ఆరేపల్లి బాబురావు

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన ఘటన అశ్వారావుపేటలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై యయాతి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గౌడబజారుకు చెందిన ఆరేపల్లి బాబురావు(25) ముస్లింబజారులోని తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా గుండెపోటు రావడంతో చెట్టుపై నుంచి కిందపడ్డారు. ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాబురావు భార్య శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తొలగిన అడ్డంకులు

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: ఖమ్మం-రాజమండ్రి మార్గంలో అశ్వారావుపేట పట్టణంలోని వివేకానంద కూడలిలో పాతఎంపీడీఓ కార్యాలయం వద్ద రోడ్డు ఆక్రమించుకుని షెడ్లు వేసుకున్న వారిని ఎట్టకేలకు ప్రశాంతంగా తొలగించారు. ఫలితంగా 15 రోజులుగా నడుస్తున్న అంశానికి తెరపడింది. గురువారం 'ఈనాడు'లో 'విస్తరణం' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఎమ్మెల్యే జారే వద్దకు వెళ్లినా జాతీయ రహదారి విస్తరణలో అడ్డుపడొద్దని చెప్పడంతో ఆక్రమణదారులు షెడ్లు ఖాళీ చేశారు. ర.భ అధికారులు దగ్గరుండి మరీ షెడ్లు తొలగించి, మురుగునీటి కాలువ నిర్మాణానికి కందకం తవ్వారు.

సుందరీకరణకు అడ్డుపడితే సహించం: జారె

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట సుందరీకరణకు ఎవరు అడ్డుపడ్డా సహించేదిలేదని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ స్పష్టం చేశారు. పట్టణంలో కల్యాణలక్ష్మి చెక్కులు, మహిళలకు చీరలు, సెర్ప్ సంఘాల మహిళలకు రుణాల చెక్కులు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పలు కాలనీల్లో గురువారం పర్యటించారు. వివేకానంద కూడలిలో షెడ్లు నిర్మించుకున్న వ్యాపారులు ఎమ్మెల్యేని కలిసి షెడ్లు తొలగించొద్దని కోరారు. భద్రాచలం మార్గంలో రహదారి విస్తరణను 50 నుంచి 45 అడుగులకు తగ్గించాలని కోరగా ఎమ్మెల్యే సున్నితంగా తిరస్కరించారు. మీ వ్యాపారాలకు ఇబ్బందిలేని రీతిలో ఒకవైపు పూర్తి అయ్యాక రెండోవైపు పనులు ప్రారంభిస్తారని హామీ ఇచ్చారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద చేప పిల్లలు పంపిణీ చేశారు. తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, జూపల్లి రమేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మా రాంబాబు పాల్గొన్నారు.

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ లక్ష్యమని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. మండలంలో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు. 'మీ ఎమ్మెల్యే మీ ఇంటికి' కార్యక్రమంలో భాగంగా నారంవారిగూడెం, మొద్దులగూడెం, ఊట్లపల్లి, కేశప్పగూడెం, వినాయకపురం, ఊసిర్లగూడెం, తిరుమలకుంట, గాండ్లగూడెం, దిబ్బగూడెం, నారాయణపురం, వడ్డెరంగాపురం, ఆసుపాక, మామిళ్లవారిగూడేన్ని ఎమ్మెల్యే సందర్శించారు. కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల ఇంటికెళ్లి ఎమ్మెల్యే అందజేశారు. అంతకుముందు మొద్దులగూడెంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, నాయకులు జూపల్లి రమేశ్, రాంబాబు, వీరభద్రరావు, హరి పాల్గొన్నారు.

✦ వినాయకపురం శ్రీచిలకలగండి ముత్యాలమ్మ ఆలయం సమీపంలో ఉన్న గోశాల అభివృద్ధిలో భాగంగా నూతనంగా షెడ్లను నిర్మిస్తున్నారు. దీన్ని అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గోశాలను సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జారె, నాయకులు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సాంకేతిక నిపుణులకు కూడా అంతుపట్టని పద్ధతుల్లో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ రవీంద్రారెడ్డి అన్నారు. మణుగూరులోని శేషగిరినగర్‌లో గురువారం ఉదయం పోలీసు శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... అసాంఘిక కార్యకలాపాలతోపాటు దాచి ఉంచిన నిషేధిత వస్తువులను కనుగొనేందుకు ఈ తనిఖీలు ఉపయోగపడతాయన్నారు. ప్రస్తుతం యువత గంజాయికి బానిస అవుతున్నారని, పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువపత్రాలులేని పలు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ సతీష్‌కుమార్, ఎస్సైలు ప్రసాద్, రాజ్‌కుమార్, తిరుపతి, రావూఫ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



గ్రామస్థులకు సూచనలిస్తున్న డీఎస్పీ రవీంద్రారెడ్డి

పంటల సాగుపై అవగాహన

దమ్మపేట, న్యూస్‌టుడే: నాగుపల్లి రైతు వేదికలో మునగ, వెదురు సాగుపై రైతులకు గురువారం అవగాహన నిర్వహించారు. అశ్వారావుపేట వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రవికుమార్ రైతులకు మునగ సాగులో లాభాలను వివరించారు. ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఏవో చంద్రశేఖర్‌రెడ్డి, ఉద్యాన అధికారి సందీప్ పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: మునగసాగులో మెళకువలపై జానకీపురంలో ఎంపీడీవో మహాలక్ష్మి రైతులకు అవగాహన కల్పించారు. ఏవో అనూష, ఏపీవో ప్రమీల పాల్గొన్నారు.

నిర్మాణ భవనం.. అసాంఘిక చర్యలు

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

మణుగూరు రాజీవ్‌గాంధీనగర్‌లో గత నాలుగేళ్లుగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం కొంతకాలంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పాలకులు, గుత్తేదార్ల నిర్లక్ష్యం కారణంగా ఈ భవన నిర్మాణం నెమ్మదిగా సాగుతోంది. 2021లో శంకుస్థాపన చేసిన అనంతరం ప్రారంభమైన ఈ భవనం పనులు ఇప్పటికీ మందకొడిగానే సాగుతున్నాయి. దీనిని ఆసరాగా చేసుకొని కొందరు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మార్చుకున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా యువకులు, కొంతమంది విద్యార్థులు భవనం లోపలికి ప్రవేశించి మద్యం సేవిస్తూ మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నారు. అంతేకాకుండా మద్యం బాటిళ్లను ఎక్కడపడితే అక్కడ పగులకొడుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో అప్పుడప్పుడూ అక్కడ పనులు నిర్వర్తించేందుకు వచ్చే వారికి ఇబ్బందిగా మారుతోంది. ఇక రాత్రివేళ ఈ భవనం ఎవరికి ఎలా కావాలంటే అలా ఉపయోగపడుతోంది. పోలీసులు స్పందించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై సీఐ సతీష్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పెట్రోలింగ్ సిబ్బందిని అక్కడకు పంపించి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కచ్చితమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం

సుందరకాండ పారాయణం



భద్రాచలం, న్యూస్‌టుడే: సుందరకాండ రామదండు ఆధ్వర్యంలో గురువారం భద్రాచలంలో సుందరకాండ పారాయణం ఘనంగా నిర్వహించారు. ఎంఎస్ రామారావు రచించిన సుందరకాండను ప్రతీ పునర్వసు నక్షత్రం సందర్భంగా పఠిస్తున్నామని ఇది 108వ పారాయణం అని నిర్వాహకులు తెలిపారు. భక్తులు ప్రధాన వీధిలో ప్రదర్శన చేసి రామాలయాన్ని దర్శించుకున్నారు. ఈ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో పారాయణం చేశారు. ఇక్కడ ప్రత్యేక పూజలు చేసిన ఉప ప్రధానార్చకుడు రామస్వరూప్ భక్తులకు ఆశీర్వచనం అందించారు.

పొదెం వీరయ్య పర్యటన

అశ్వాపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పొదెం వీరయ్య గురువారం మొండికుంట, మల్లెలమడుగు గ్రామాల్లో పర్యటించారు. మొండికుంటలో బైపాస్ శస్త్రచికిత్స చేయించుకున్న కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కొండాబత్తుల ఉపేందర్, మల్లెలమడుగులో వాహన ప్రమాదంలో గాయపడిన మేరెడ్డి చలపతిరెడ్డి ఇళ్లకు వెళ్లి వారిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మటం నరేశ్, తూము వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



ఉపేందర్‌ను పరామర్శిస్తున్న పొదెం వీరయ్య

కొత్తగూడెం
• కొత్తగూడెం • ఇల్లెందు

వసతి గృహంలో డీడీ విచారణ

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ అంబేడ్కర్ కూడలి సమీపంలోని గిరిజన బాలుర వసతి గృహం(ఎస్టీబీహెచ్)లో ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ గురువారం విచారణ జరిపారు. విధుల్లో అలసత్వం వహిస్తున్నారనే కారణంతో వసతి గృహ సంక్షేమాధికారి తిరుమలరావును ఇటీవల ఐటీడీఏ పీవో సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డీడీ విచారణ కొనసాగించారు. విద్యార్థులు, వంట నిర్వాహకులతో పాటు సంక్షేమాధికారిని ఆమె వేర్వేరుగా విచారించారు. నివేదికను పీఓకు అందజేయనున్నట్లు చెప్పారు.


విద్యార్థుల వద్ద వివరాలు సేకరిస్తున్న డీడీ మణెమ్మ

'ఐలు' సమావేశం విజయవంతానికి పిలుపు

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం సప్తపది ఫంక్షన్ హాల్‌లో ఈనెల 26, 27 తేదీల్లో జరిగే మహిళా న్యాయవాదుల రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం కొత్తగూడెం జిల్లా బాధ్యులు కిలారు పురుషోత్తంరావు, కె.పుల్లయ్యలు గురువారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. మహిళా విభాగం కన్వీనర్ చందాల తెలంగాణ అధ్యక్షతన జరిగే సభలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎల్.జయశ్రీ ప్రారంభోపన్యాసం చేస్తారని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689



సమస్య: పాత కొత్తగూడెం 9వ వార్డులో ఇళ్ల మధ్యలోనున్న టీజీఎన్‌పీడీసీఎల్ భవనం సమీపంలో చెత్తకుప్పలు గుట్టల్లా పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. చెత్త తరలింపు చేయకుండా చర్యలు తీసుకోవాలి. - స్థానికులు
సమాధానం: బొజ్జ సాయంతో యార్డు లోని చెత్తను త్వరలో చదును చేసేలా చర్యలు తీసుకుంటాం. - వీరభద్రాచారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్
– కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

గట్టాయిగూడెం కాలనీలో డ్రైనేజీలో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది.
- పూర్ణ, స్థానికుడు
✔ వీరయ్య జవాన్‌కు చెప్పి పూడికతీత చేపడతాం. - కేవీ లక్ష్మణ్‌రావు, పారిశుద్ధ్య అధికారి
– పాల్వంచ, న్యూస్‌టుడే

కొమ్ముగూడెం చివరి వీధి గాంధీనగర్ వద్ద జనావాసాలకు సమీపంలోనే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. - భూక్యా దేవీలాల్, కొమ్ముగూడెం
✔ పరిశీలించి చెత్తకుప్పను తొలగిస్తాం.
- జ్యోతి, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి
– జూలూరుపాడు, న్యూస్‌టుడే

హామీలను నెరవేర్చాలని డిమాండ్

టేకులపల్లి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ఎన్డీ జిల్లా కార్యదర్శి బానోత్ ఊక్లా, రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరం సత్యనారాయణ డిమాండ్ చేశారు. రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. తహసీల్దార్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఉప్పరబోయిన రామ్మూర్తి, కందగట్ల సురేందర్, కృష్ణ, పాపారావు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



రైతుకూలీ సంఘం నాయకుల ఆందోళన

డిపో సమస్యలపై సీపీఎం ధర్నా

ఇల్లెందు గ్రామీణం: ఇల్లెందు ఆర్టీసీ డిపోలోని కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని సీపీఎం జిల్లా నాయకులు అబ్దుల్ నబి అన్నారు. డిపో, బస్టాండ్ వద్ద గురువారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బంద్ ఏర్పాటు చేయాలని, దూరప్రాంతాలకు బస్సులను నడపాలన్నారు. కృష్ణ, కిరణ్, మోహన్‌రావు, లక్ష్మీ, రాము, పద్మ, హుస్సేన్ పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పించాలని.. పంటలకు మద్దతు ధర కల్పించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో ఇల్లెందు తహసీల్దార్ కార్యాలయం నిరసన తెలిపారు.

ఆసక్తి కొద్దీ.. అతివల వ్యాపారాభివృద్ధి

కొత్తగూడెం సంక్షేమ విభాగం, న్యూస్‌టుడే

అంది వచ్చిన రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని కొందరు మహిళలు ఆర్థిక స్వావలంబనకు బాటలు పరుచుకుంటున్నారు. కొందరు వినూత్న ఆలోచనలతో చిరు వ్యాపారాలు ప్రారంభించి లాభాలు ఆర్జిస్తున్నారు. కుటుంబ పోషణలో కీలకపాత్ర పోషిస్తూ మిగతా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) తోడ్పాటుతో.. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సమాఖ్య, పీఎంఈజీపీ తదితర రుణ ప్రోత్సాహంతో పలు వ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళలపై ప్రత్యేక కథనం.


పుట్టగొడుగులు పెంచుతున్న మండే ప్రవంతి

ఉపాధికి పుట్ట గొడుగు

ఒకరికొకరు ఆలోచనలు పంచుకుంటే, చేతులు కలిపి ముందుకు సాగితే విజయం సాధించవచ్చని నిరూపించారు.. నాయకులగూడెం గ్రామానికి చెందిన గంగాభి స్వయం సహాయక సంఘం సభ్యులు. మండే ప్రవంతి తన నివాసంలో మరో ముగ్గురు సభ్యులైన పద్మ, జయమ్మ, రజితతో కలిసి పుట్టగొడుగుల పెంపకాన్ని మూణ్నెల్లుగా చేపడుతున్నారు. ఇందుకు ముందు వారు జనగాంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్ చొరవతో శిక్షణ తీసుకున్నారు. రసాయనిక ఎరువులను వినియోగించకుండా సేంద్రియ పద్ధతిలో పెంచే పుట్టగొడుగులకు మంచి గిరాకీ ఉంది. పోషకాలు, విటమిన్ 'డి' అధికంగా ఉండి.. గుండె ఆరోగ్యానికి మేలు చేసేవి కావడంతో స్థానికులే కొనుగోలు చేస్తున్నారు. 'స్త్రీనిధి' పథకం ద్వారా రూ.60 వేల పెట్టుబడితో ప్రారంభించిన వ్యాపారం ప్రస్తుతం లాభాలను తెచ్చిపెడుతోంది. నలుగురు సభ్యులు ఒక్కొక్కరు నెలకు రూ.10 నుంచి రూ.15 వేల వరకు ఆదాయాన్ని ఇళ్ల నుంచే గడిస్తున్నారు.

పాలలాంటి స్వచ్ఛమైన వ్యాపారం..

మరో సభ్యురాలు ఎల్లబోయిన కళావతి.. సుజాతనగర్ మండల కేంద్రంలో సెర్ప్ ప్రోత్సాహంతో పాల ఉత్పత్తుల వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. సంఘంలో సభ్యురాలు కావడంతో పాల ఉత్పత్తుల దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. స్వచ్ఛమైన పాలతో పాటు పెరుగు, జున్ను, హబ్బికోవ, నెయ్యి, దూద్‌పెడ, పన్నీరు, ఐస్‌క్రీమ్స్ వంటి ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. వేడుకలకు ముందస్తు ఆర్డర్లపై పెరుగు, పాలు సరఫరా చేస్తూ.. నెలకు రూ.10 వేల వరకు ఆర్జిస్తూ.. గత ఆర్నెల్లుగా కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరందరి స్ఫూర్తితో నాయకుల గూడెం గ్రామానికి చెందిన స్రవంతి కొర్రమేను చేపల పెంపకానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే శిక్షణ తీసుకోగా.. స్థలం, నీటి వసతులను పరిశీలిస్తున్నారు.


పాల ఉత్పత్తులు విక్రయిస్తున్న కళావతి (కుడి నుంచి రెండో మహిళ)

లాభాలు కొక్కొరొకో..

సుజాతనగర్ మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన ఆకుల స్వరూప నాటుకోళ్ల పెంపకం చేపట్టారు. సెర్ప్ సహకారంతో ఆరేళ్ల క్రితం తమ సొంత భూమిలో కోళ్ల షెడ్డు నిర్మించారు. రూ.3 లక్ష రుణం పొంది. . కోడిపిల్లలను తీసుకొచ్చి పెంచారు. ప్రస్తుతం కోళ్లు, గుడ్లు, మాంసం విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు. ఆసక్తి ఉన్నవారికి పిల్లలనూ విక్రయిస్తున్నారు. అంతకు ముందు కోళ్ల పెంపకంపై జనగాం, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో శిక్షణ తీసుకున్నారు. మెలకువలు తెలుసుకున్నాక తమిళనాడు రాష్ట్రంతో పాటు జనగాం నుంచి పిల్లలను తీసుకొచ్చారు. సోనాలి (గుడ్లు పెట్టేవి), హసిలి(మాంసం)రకం కోళ్లను పెంచుతున్నారు. స్థానిక మార్కెట్‌లో కోడిపిల్లలు, గుడ్లు, మాంసానికి మంచి డిమాండ్ ఉంది. ఏడాదికి రూ.లక్షన్నర నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం మిగులుతుందని స్వరూప అన్నారు.


కోళ్ల షెడ్డు వద్ద ఎ.స్వరూప

"రుణ సదుపాయానికి తోడు కాస్త ప్రోత్సాహం అందిస్తే మహిళలు ఏ రంగంలోనైనా రాణించగలరు. ఇందిర మహిళా శక్తి పథకం అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ఆసక్తి ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు కావాల్సిన రుణాలను కలెక్టర్ సాయంతో వేగంగా మంజూరు చేయిస్తున్నాం. వ్యాపారాల నిర్వహణలపైనా శిక్షణలు ఇప్పిస్తున్నాం. ఆసక్తి ఉన్న సభ్యులెవరైనా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని సెర్ప్ సీసీ శిరీష 'న్యూస్‌టుడే'తో అన్నారు.

పోలియో నిర్మూలన అందరి బాధ్యత



సదస్సులో ప్రసంగిస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షురాలు పి.సుజాత

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: చిన్నారులు పోలియో బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రోటరీ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం అధ్యక్షురాలు పి.సుజాత అన్నారు. 'ప్రపంచ పోలియో దినోత్సవం' సందర్భంగా కొత్తగూడెం ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుజాత మాట్లాడుతూ రెండు చుక్కల మందు పోలియోను నివారిస్తుందని.. అయినా కొందరు అవగాహన లేమితో వాటిని పిల్లలకు వేయించడం లేదన్నారు. మహమ్మారి నివారణకు రోటరీ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎంతో కృషిచేస్తోందన్నారు. కళాశాలల డైరెక్టర్ శ్రీరామనేని చలపతిరావు, క్లబ్ ఉపాధ్యక్షురాలు ఉషారాణి, కోశాధికారి డా.సావిత్రి, సిరిమళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆరేళ్లు.. రోడ్డుకు నోచని ఊళ్లు



మండలంలోని కోయగూడెం పంచాయతీ లచ్చగూడెం నుంచి ఇప్పల తండా, గంగాపురాన్ని కలుపుతూ కి.మీ. మేర బీటీ రోడ్డు నిర్మాణానికి 2017-18లో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.కోటి మంజూరయ్యాయి. పనులు పొందిన గుత్తేదారు రోడ్డు తవ్వి.. కంకర పరిచి పత్తాలేకుండా పోయారు. ఆరేళ్లు కావస్తున్నా పనులు పట్టాలెక్కడం లేదు. పంచాయతీరాజ్ ఏఈ నవీన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా గంగాపురం-ఇప్పలతండా మధ్య సీసీరోడ్డు నిర్మించనున్నట్లు చెప్పారు. మిగతా ఇప్పలతండా-లచ్చగూడెం మార్గం పనులకు రీటెండరు పిలుస్తామన్నారు. – టేకులపల్లి, న్యూస్‌టుడే

సాయినాథుడికి స్వరాంజలి

విద్యానగర్ కాలనీ సాయిబాబా ఆలయంలో అమృత వర్షిణి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సంగీత విభావరి నిర్వహించారు. పలువురు చిన్నారులు సాయి సంకీర్తనలు ఆలపించి అలరించారు. అలిపిరెడ్డి ఉదయ్‌భాస్కర్ బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంది.
– కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే



అవార్డు.. అందరి కృషి ఫలితం



ఉద్యోగుల సమష్టి కృషితోనే జేకే-5 ఉపరితల గనికి 'ఫైవ్ స్టార్' అవార్డు లభించిందని ఇల్లెందు సింగరేణి జీఎం జాన్ ఆనంద్ అన్నారు. ప్రాజెక్టు అధికారి కృష్ణమోహన్ అధ్యక్షతన గని ఆవరణలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు బొల్లం వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, చిన్నయ్య, పూర్ణచందర్, నాయకులు నజీర్‌అహ్మద్, సంజీవచారి పాల్గొన్నారు. – ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

డీలర్ల శిక్షణలో గోల్డ్ మెడల్

టేకులపల్లి, న్యూస్‌టుడే: విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వ్యాపారం చేసే డీలర్లకు డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఇన్‌పుట్ (దేశీ) శిక్షణ ఇటీవల పూర్తయ్యింది. చుంచుపల్లి మండలం ప్రశాంతినగర్ రైతువేదికలో రెండ్రోజుల క్రితం ధ్రువపత్రాల పంపిణీని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ చేతుల మీదుగా వ్యవసాయ శాఖ అధికారులు చేపట్టారు. గత 12 నెలల్లో 48 వారాల పాటు నిర్వహించిన శిక్షణలో తనకు గోల్డ్ మెడల్‌ను కలెక్టర్ బహూకరించినట్లు బోడుకు చెందిన తేరాల రమేశ్‌బాబు గురువారం విలేకరులకు తెలిపారు. కొప్పురాయికి చెందిన మరో డీలర్ బొప్పన సుబ్బారావు సిల్వర్ మెడల్ అందుకున్నారు.

పాఠశాల అభివృద్ధికి పీఈటీ విరాళం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని చెన్నంగలగడ్డ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ టి.విరాంజి విద్యాలయం అభివృద్ధి నిమిత్త రూ.20 వేలను ప్రధానోపాధ్యాయుడు నామకు గురువారం అందజేశారు. సిమెంటు బల్లలు, ఇతర పనులకు సాయం చేసిన పీడీని ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం చేయొద్దు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: వైద్య సేవల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సుకృత తెలిపారు. కొమరారం పీహెచ్‌సీని ఆమె గురువారం తనిఖీ చేశారు. వైద్యులు దండా లోహిత, మైస ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సుకృత

'మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి'

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణి ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను అమలు చేయడం లేదని, నిబంధనను పక్కాగా అమలు చేయాలని బీఎంఎస్ నాయకులు పి.మాధవనాయక్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై న్యాయపరమైన సంప్రదింపులు జరుపుతున్నట్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కన్వేయన్స్ డ్రైవర్లకు కనీస వేతనాలివ్వాలి

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణిలో కన్వేయన్స్ డ్రైవర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు గురువారం ట్రాన్స్‌పోర్టు జీఎం సీతారామయ్యకు వినతిపత్రాన్ని సమర్పించారు. కన్వేయన్స్ డ్రైవర్లుగా సుమారు 2 వేల మంది పనిచేస్తున్నారని వివరించారు. బి.మధు, అయిలయ్య, రమేష్ పాల్గొన్నారు.

27న 'మాల మహానాడు పాదయాత్ర'

టేకులపల్లి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 25న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో భద్రాచలం నుంచి తలపెట్టిన పాదయాత్ర 27వ తేదీన మండలంలోకి ప్రవేశిస్తుందని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం మండలాధ్యక్షుడు కె.సుందర్‌పాల్ కోరారు. సులానగర్ గ్రామంలో కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు.

అయోడిన్ లోపంతో అనారోగ్య సమస్యలు

టేకులపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు అయోడిన్ సమృద్ధిగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేశ్ సూచించారు. మండలంలోని ఏకలవ్య పాఠశాలలో వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ నిశాంత్ కృష్ణ, హెచ్ఈఓ దేవా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి దంతెలబోరలో 'సమగ్ర భూ సర్వే'

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: సమగ్ర భూ సర్వేను పైలెట్ ప్రాజెక్టుగా మండలంలోని దంతెలబోర రెవెన్యూ గ్రామంలో శుక్రవారం నుంచి చేపడుతున్నట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు గురువారం తెలిపారు. సర్వే నంబరు 135కు సంబంధించి రైతులు అందుబాటులో ఉండి సర్వేకు సహకరించాలని వారు కోరారు.

శౌరీని పరామర్శించిన డీసీసీ అధ్యక్షుడు

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవల స్వల్ప గుండెపోటుకు గురైన టీపీసీసీ సభ్యులు, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ జేబీ శౌరీని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య గురువారం పరామర్శించారు. కొత్తగూడెం రామాంజనేయకాలనీలోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న శౌరీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

సంస్మరణ సభకు ఎమ్మెల్యేలు హాజరు

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్ హెచ్-143) జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్ తల్లి జయమ్మ సంస్మరణ సభ గురువారం హేమచంద్రాపురంలో జరిగింది. కొత్తగూడెం, ఇల్లెందు ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని), నాగ సీతారాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు దుద్దుకూరి రామారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇల్లెందు గ్రామీణం: గుండాల మండలం శంభునిగూడెంకు చెందిన ఈసం సమ్మయ్య (35) ఈ నెల 9న గ్రామం నుంచి బైక్‌పై ఇల్లెందు మండలం కొమరారం వస్తుండగా.. ఎదురుగా బైకుపై వచ్చిన ఇల్లెందు మండలం లచ్చగూడెం పంచాయతీ వేపలగడ్డకు చెందిన చింత నవీన్ స్థానిక రైస్‌మిల్లు వద్ద ఢీకొన్నాడు. సమ్మయ్యను ఇల్లెందు, అక్కడ్నుంచి ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

రడం శ్రీను సంస్మరణ సభ

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో రడం శ్రీను కీలక పాత్ర పోషించారని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ తెలిపారు. మండలంలోని కొమరారంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రడం శ్రీను సంస్మరణ సభను గురువారం నిర్వహించారు. రాష్ట్ర కోకన్వీనర్ మెంతెన సంజీవరావు, చిర్రా రవి, నలమాస కృష్ణ, రాజనరసింహా, ఎన్డీ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, భారాస నాయకులు దిండిగాల రాజేందర్, మాస్‌లైన్ నాయకులు నాయిని రాజు, బిచ్చ, పృథ్వీ పాల్గొన్నారు. రడం శ్రీను చిత్రపటానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఇల్లెందు మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ వెంకట్‌గౌడ్, పలువురు నాయకులు నివాళులర్పించారు.


మాట్లాడుతున్న పౌర హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.గడ్డం లక్ష్మణ్

జంట పట్టణాల అభివృద్ధికి కృషి: కూనంనేని

పాల్వంచ, న్యూస్‌టుడే: కొత్తగూడెం, పాల్వంచ జంట పట్టణాల అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ చిన్నబంగారుజాల, గుడిపాడు, శ్రీనివాస కాలనీ, ఇందిరానగర్ కాలనీ, వనమా కాలనీ, కాంట్రాక్టు కాలనీల్లో రూ.2.28 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. పనులను నాణ్యతగా చేపట్టాలని గుత్తేదారులను ఆదేశించారు. జంట పట్టణాలను కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయడంతో పాటు రింగ్‌రోడ్డు, విమానాశ్రయం ప్రతిపాదనలకు మరికొద్ది రోజుల్లో ప్రభుత్వం నుంచి అనుమతి రానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, పురపాలక కమిషనర్ ఢాకునాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు పూర్ణచంద్రరావు, సాయిబాబా, టీపీసీసీ సభ్యుడు నాగసీతారాములు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు రంగారావు, టీడీపీ నాయకుడు కనగాల అనంతరాములు పాల్గొన్నారు.

చుంచుపల్లి, న్యూస్‌టుడే: పట్టణంతో పాటు గ్రామాల్లో ప్రజలెదుర్కొంటున్న తాగునీటి ఎద్దడి నివారణకు కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నందాతండా పంచాయతీ హౌజింగ్‌బోర్డు కాలనీలో రూ.33 లక్షలతో నిర్మిస్తున్న ఉపరితల భాండాగారం నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గంలోని పెద్ద, చిన్న నీటి పథకాలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా ఈఈలు నళిని, తిరుమలేశ్, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో అశోక్‌కుమార్, ఏఈలు వసంత, వెంకటస్వామి పాల్గొన్నారు.


గుడిపాడుకాలనీలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కూనంనేని శంకుస్థాపన

మునగ సాగు.. అన్నివిధాలా మేలు

సుజాతనగర్, న్యూస్‌టుడే: రైతులు ఆరోగ్యాన్నందించే, లాభదాయకమైన పంటలు పండించాలని జడ్పీ సీఈవో చంద్రశేఖర్ అన్నారు. పాతఅంజనాపురంలో మునగ తోట సాగు, కొర్రమేను, నాటుకోళ్ల పెంపకంపై గురువారం అవగాహన కల్పించారు. సీఈవో మాట్లాడుతూ పోషక విలువలున్న ఆహార ఉత్పత్తుల వైపు రైతులు అడుగులు వేయాలన్నారు. అనంతరం ఆయన కరపత్రాలు విడుదల చేశారు. ఎంపీడీఓ భారతి, ఎంపీఓ శ్రీనివాస్, ఏఓ నర్మద, ఏపీఓ చందర్‌బాబు పాల్గొన్నారు.

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: మునగ సాగు లాభాలపై తోగ్గూడెం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఉపాధిహామీ పథకం ద్వారా అందించే ఆర్థిక సాయం, దిగుబడులు, మార్కెటింగ్ అంశాలపై ఎంపీడీవో అన్నదాతలు సూచనలు చేశారు. ఎంపీవో నారాయణ, ఏపీఎం రాంబాబు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.


సుజాతనగర్: కరపత్రాలను విడుదల చేస్తున్న సీఈవో చంద్రశేఖర్ తదితరులు

జూలూరుపాడు, న్యూస్‌టుడే: రైతులు మునగ సాగుతో అధిక ఆదాయం గడించవచ్చని జడ్పీ సీఈఓ చంద్రశేఖర్ సూచించారు. జూలూరుపాడు మండలం వినోభానగర్‌లో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులకు ఉచితంగా మునగ మొక్కలను అందించడంతో పాటు, నిర్వహణ ఖర్చులను ప్రభుత్వమే ఇవ్వనుందన్నారు. మార్కెట్‌లో మునగ కాయలకు, ఆకులకు, కాండానికి ఇలా అన్ని భాగాలకు సంబంధించిన ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉండనుందని, వీటి ఉత్పత్తులను విక్రయించి ఆదాయం పొందేందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఎంపీఓ తులసీరాం, ఏపీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్పన.. రుణభారాన

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల నిర్మించిన రాజీవ్ గృహకల్ప నివాసాల విక్రయంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఇల్లెందులోని నిర్మాణాలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది స్థానికంగా ఆసక్తికరంగా మారింది. దశాబ్దంన్నర క్రితం ఇక్కడ రాజీవ్ గృహకల్ప నిర్మాణాలు చేపట్టగా.. అవి అసంపూర్తిగా మిగిలిపోయాయి. వాటిపై ఆశలు పెట్టుకున్న లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. వీటికోసం బ్యాంకుల్లో రుణాలు తీసుకుని ఆర్థికంగా ఇక్కట్లుపడ్డారు. ఏళ్లుగా ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకపోగా.. అసలు రుణం, వడ్డీ భారం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు ఇప్పటి వరకు చేపట్టిన నిర్మాణాల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతుండగా, అవి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారినట్లు ఇటీవల పలువురు ప్రజాప్రతినిధులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సైతం వివరించారు.


అసంపూర్తిగా రాజీవ్‌గృహకల్ప నిర్మాణాలు

సాంఘిక సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం, ఖమ్మం డివిజన్ ద్వారా 2006లో ఇల్లెందు పట్టణంలో రాజీవ్ గృహకల్ప పథకం కింద ప్లాట్లు కేటాయించేందుకు నిర్ణయించారు. సొంతిల్లు, నివాస స్థలం లేని వేతన జీవులైన అర్హులకు బ్యాంకు రుణం ద్వారా వీటి నిర్మాణాలను ప్రారంభించారు. ఆ తర్వాత 2007-08లో 30 మంది అర్హుల కోసం గుత్తేదారు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో లబ్ధిదారు రూ.89 వేల చొప్పున బ్యాంకుల్లో రుణాలు తీసుకోగా.. కొద్ది రోజుల తర్వాత పనులు నిలిచిపోయాయి. ఇప్పుడా రుణభారం రూ.2.5 లక్షలకు పెరిగిందని.. ఈ మొత్తాన్ని చెల్లించాలని మరోవైపు లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి నోటీసులు వస్తున్నాయి. 'ప్రభుత్వం స్పందించి లబ్ధిదారులకు న్యాయం చేయాలి. లేదంటే రుణభారాన్ని తొలగించి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారానైనా అవకాశం కల్పించాలి' అని మాజీ కౌన్సిలర్ సుదర్శన్ కోరి డిమాండ్ చేశారు.

★ " పట్టణంలో అసంపూర్తిగా నిలిచిన రాజీవ్ గృహకల్ప ప్లాట్లపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు, సూచనలు అందలేదు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం చర్యలు తీసుకుంటాం' అని కమిషనర్ యాదగిరి 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

మల్లగుల్లాలు.. మళ్లీ ఆయనకే పగ్గాలు?

పాల్వంచ, న్యూస్‌టుడే

పాల్వంచ పట్టణం అంబేడ్కర్ కూడలి సమీపంలోని గిరిజన బాలుర వసతి గృహం(ఎస్టీబీహెచ్) సంక్షేమాధికారి తిరుమలరావు సస్పెండై ఐదు రోజులు కావస్తోంది. ఇంకా ఇతర సంక్షేమాధికారిని ప్రత్యామ్నాయంగా నియమించకపోవడం చర్చనీయాశమవుతోంది. భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ స్వయంగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ, ఆ స్థానంలో కొత్త సంక్షేమాధికారి నియామకంపై జాప్యం జరుగుతుండటం సందేహాలకు తావిస్తోంది. తాత్కాలికంగా ఎవరైనా సంక్షేమాధికారికి బాధ్యతలను అప్పగించాలని పీఓ ఆదేశించారు. కానీ క్షేత్రస్థాయిలో ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్, ఏటీడీఓలు ఆ దిశగా ఇంకా నిర్ణయం తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



చక్రం తిప్పుతున్నాడా?

సస్పెండైన సంక్షేమాధికారి తన పలుకుబడి, పరపతిని ఉపయోగించి రాష్ట్ర గిరిజన శాఖ నుంచి ఐటీడీఏ అధికారులకు సిఫార్సులు చేయించడంతో పాటు.. ఉద్యోగ సంఘాల నాయకులతో ఒత్తిడి తెస్తున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. వేటు పడిన తర్వాత కూడా ఆయనే వసతిగృహం బాధ్యతలు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇది నిబంధనల ప్రకారం విరుద్ధమే అవతుంది.

★ ఈ విషయాన్ని ఐటీడీఏ డీడీ మణెమ్మ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. కొత్త సంక్షేమాధికారి నియామకం చేపట్టాలని ఏటీడీఓను ఆదేశించానన్నారు. తాను విచారణాధికారిగా వ్యవహరిస్తున్నానని, ఈ ఘటనపై పీవోకు వెంటనే నివేదిక అందజేస్తానన్నారు.